ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 3, జూన్ 2025

# ఆయకట్టుకు జీవం

ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలు అనేకచోట్ల కోసుకుపోయాయి. కొన్నిచోట్ల లైనింగ్ కూడా దెబ్బతింది. కాలువలకు నిండుగా నీరు విడుదల చేస్తే తెగిపోయే పరిస్థితి ఉంది. కట్టలపై చిల్లచెట్లు దట్టంగా పెరిగి రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. మేజర్లు, మైనర్ల రూపురేఖలు కూడా మారిపోయాయి. తూర్పువీరాయపాలెం మేజర్‌లో చిల్లచెట్లు దట్టంగా మొలిచాయి. అనేకచోట్ల కట్ట బలహీనపడింది.

దర్శి, ఒంగోలు బ్రాంచ్ కాలువల పరిధిలోని మేజర్లు, మైనర్లు గత ఐదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఏడాది సాగర్ జలాలు విడుదల చేసేలోపు పనులు పూర్తయ్యే అవకాశం ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కోసుకుపోయిన ఒంగోలు బ్రాంచి కాలువ కట్ట

**సాగర్ జలాలు పారేందుకు ఆటంకాలు తొలగనున్నాయి. కాలువల బాగుకు రంగం సిద్ధమైంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వకాలంలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోక చిల్లచెట్లు, తూటుకాడతో నిండిపోయిన కాలువలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రవాహానికి అవరోధం లేకుండా చేసి ఎగువ నుంచి వచ్చే నీరు పొలాలకు చేరేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం అత్యవసర పనుల పేరుతో తాజాగా ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్నిరకాల కాలువల మరమ్మతులకు రూ.8.70 కోట్లు మంజూరు చేసింది. రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన మొత్తం 232 పనులు చేయించనుంది.**

## సాగర్ కాలువల మరమ్మతులకు మోక్షం

### ఉమ్మడి జిల్లాకు రూ.8.70కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

- నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు
- వారు ముందుకు రాకపోతే స్వల్పకాలిక టెండర్లు
- ఐదేళ్లు కాలువల గురించి పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం
- ఎట్టకేలకు ఆ సమస్యకు పరిష్కారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


ఓబీసీపై శిథిలస్థితిలో ఉన్న షట్టర్లు

ఒంగోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగు, తాగునీటి వనరు సాగర్ కాలువలే. 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ఒకవైపు ప్రపంచ బ్యాంకు నిధులు, మరోవైపు రాష్ట్రప్రభుత్వం ద్వారా నిధులు ఇచ్చి భారీగా కాలువలను ఆధునికీకరించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. కనీస మరమ్మతుల గురించి కూడా పట్టించుకోలేదు. దీంతో ప్రధాన.. మేజర్, మైనర్ కాలువలు అన్న తేడా లేకుండా అన్నింటిలోనూ చిల్లచెట్లు, తూటుకాడ భారీగా పెరిగిపోయింది. అనేకచోట్ల కట్టలు బలహీన పడ్డాయి. డ్రాపులు, షట్టర్లు ధ్వంసమై నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఈ అవస్థలను గుర్తించి అత్యవసర పనులను చేపట్టింది. అయితే వ్యవసాయ సీజన్, కాలువల్లో

మిగతా 2వ పేజీలో

### చీమకుర్తి డివిజన్‌కు ఎక్కువ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాస్థాయి అధికారులు ప్రతిపాదనలను తయారు చేసి పంపారు. వాటిని పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.374 కోట్ల విలువైన పనులను మంజూరు చేశారు. అందులో ఒంగోలు కేంద్రంగా ఉన్న ఎన్ఎస్‌పీ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగర్ కాలువల్లో అత్యవసర పనులకు రూ.8.70 కోట్లు మంజూరయ్యాయి. గతంలో ఈ తరహా పనులు స్వల్పంగా మాత్రమే జరిగిన చీమకుర్తి డివిజన్‌లోని సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి నియోజకవర్గాల్లో కాలువల మరమ్మతులకు రూ.5.12 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో 87 పనులు చేపట్టనున్నారు. అలాగే దర్శి డివిజన్‌లో పరిధిలో 37 పనులకు రూ.1.08 కోట్లు మంజూరయ్యాయి. ఆ డివిజన్‌లో గత ఏడాది దాదాపు రూ.3.50 కోట్లతో పనులు మంజూరు చేసి ఉండటంతో ఈసారి కొంత తగ్గించారు.


చిల్లచెట్లతో మూసుకుపోయిన తూర్పువీరాయపాలెం మేజర్


బాధ్యతలు స్వీకరిస్తున్న కాశిరెడ్డి, పక్కన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, డీసీసీబీ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య

# డీసీఎంఎస్‌ను అభివృద్ధి చేస్తా

- చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాశిరెడ్డి

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తానని శ్యామల కాశిరెడ్డి తెలిపారు. డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా తన నియామకానికి ముఖ్యకారకులైన కనిగిరి, ఒంగోలు ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత కార్యాలయంలోని తన చాంబర్‌లో పూజలు చేశారు. అనంతరం కాశిరెడ్డిని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి తీసుకెళ్లి సీటులో కూర్చోబెట్టారు. తర్వాత ఆయనతో జిల్లా సహకారాధికారి(డీసీవో) ఎన్.ఇందిరాదేవి సంతకం చేయించారు. కనిగిరి నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు బొకేలు, శాలువలతో కాశిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బిజినెస్ మేనేజర్ రామచంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

3

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచన



# జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

**విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు**

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియేట్ విద్యా మండలికి అనుబంధంగా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలు వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కె.ఆంజనేయులు, ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు అందజేస్తామన్నారు. పుస్తకాలు ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరాయని తెలిపారు. విద్యార్థులు కళాశాలల్లో చేరిన వెంటనే వారికి అందజేసేలా ఏర్పాట్లు చేసినట్లు వారు చెప్పారు.

## ఐదుగురికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఐదు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. సోమవారం అర్హులైన స్కూలు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించి ఆ పోస్టుల్లో నియమించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. గతనెల 30న నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన మూడు, మే 31న రిటైర్మెంట్ ద్వారా వచ్చిన రెండు ఖాళీలను కలిపి నింపారు. సీనియారిటీ జాబితా సీరియల్ నంబరు 141 నుంచి ఉన్న స్కూలు అసిస్టెంట్లతో ఈ పోస్టులు భర్తీచేశారు. ప్రస్తుతం జడ్పీ యాజమాన్యంలోని హైస్కూళ్లలో ఒక్క హెచ్‌ఎం పోస్టు కూడా ఖాళీగా లేదు. జిల్లాలో బదిలీల ద్వారా 101 మంది, ఉద్యోగోన్నతుల ద్వారా మొత్తం 88 మంది కలిపి 189 హైస్కూళ్లకు కొత్త హెడ్మాస్టర్లు బాధ్యతలు స్వీకరించినట్లు అయింది.



# వితలాపురం సర్పంచ్‌పై చర్యలు !

- వాడుకున్న నిధులు రాబట్టేందుకు ఆర్ఆర్ యాక్టు
- తహసీల్దార్, కార్యదర్శికి డీపీవో ఆదేశాలు

తాళ్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన తాళ్లూరు మండలం వితలాపురం సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి మారం ఇంద్రసేనారెడ్డిపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. ఆర్ఆర్ యాక్ట్ ద్వారా నిధులు రాబట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకనాయుడు స్థానిక తహసీల్దార్, వితలాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

### గొట్టిపాటి లక్ష్మి ఫిర్యాదుతో అధికార యంత్రాంగంలో కదలిక

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి స్వయంగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మార్చి 21న కలిసి విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ హయాంలో వితలాపురం సర్పంచ్ టీడీపీ కార్యకర్తల నిధులు రూ.55లక్షలు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. ఆర్ఆర్‌యాక్ట్ ద్వారా నిధులు రాబట్టి పనిచేసిన వారికి చెల్లించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినా అప్పట్లో పట్టించుకోలేదన్నారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. దీంతో డీపీవో హైకోర్టు ఉత్తర్వుల పూర్వాపరాలను పరిశీలించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ ఇంద్రసేనారెడ్డిపై ఆర్ఆర్‌యాక్ట్ ప్రయోగించి నిధులు రాబట్టేందుకు ఉపక్రమించారు.





పంచాయతీ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి

ఈమేరకు సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు అందాయి. వితలాపురం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద 2018-19 సంవత్సరంలో టీడీపీ నాయకులు మానం రమేష్‌బాబు, షేక్ కాలేషావలిలు అభివృద్ధి పనులు చేశారు. సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి వారికి బిల్లులు చెల్లించకపోవడంతో 2021 డిసెంబరు 2న హైకోర్టును ఆశ్రయించారు. అయితే సర్పంచ్ కోర్టు ఆదేశాలను పాటించకుండా మరొకరికి బిల్లులు

మిగతా 2వ పేజీలో


పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో వెంకటనాయుడు

# ప్రశాంతంగా బదిలీల కౌన్సెలింగ్

- పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు హాజరు
- త్వరలో వారందరికీ పోస్టింగ్‌లు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో సోమవారం డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు ప్రక్రియను చేపట్టారు. డిప్యూటీ మండల పరిషత్ అధికారుల బదిలీల కోసం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది 19 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఆయా పంచాయతీల్లో ఖాళీల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు 72 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 11, గ్రేడ్-2 కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 కార్యదర్శులు 29 మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 30 మంది బదిలీ కోరుకున్నారు. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరికి త్వరలోనే పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.


ఎస్‌ఐ రాజ్‌కుమార్

# సారు.. స్టేషన్‌కు రారు!

**ఎస్‌ఐ కోసం మూడు గంటలు వేచి ఉన్న సీఐ**

**కొనకనమిట్ల ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను వీఆర్‌కు పిలిచిన ఎస్పీ దామోదర్**

ఒంగోలు క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు రాకుండా బయట సెటిల్మెంట్‌లు చేసుకుంటూ తిరుగుతున్న కొనకనమిట్ల ఎస్‌ఐ రాజ్‌కుమార్‌పై వేటు పడింది. ఎస్పీ దామోదర్ సోమవారం అతనిని వీఆర్‌కు పిలిచారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎవరికైనా అత్యవసరమై ఫోన్ చేసినా ఎస్‌ఐ తీయని పరిస్థితి ఉందని కొనకొనమిట్ల మండల ప్రజలు అంటున్నారు. ఆయన బయట సివిల్ పంచాయితీలు చేయడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు. సార్.. ఎస్‌ఐ గారు ఎక్కడ ఉన్నారు..! అని నేరుగా కొందరు సీఐకి ఫోన్ చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆదివారం కొనకనమిట్లకు వెళ్లారు. ఆయన మూడు గంటలు వేచి ఉన్నా ఎస్‌ఐ రాలేదు. దీంతో వెంటనే ఎస్పీకి సమాచారం ఇచ్చారు. గతంలోనూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో వెంటనే సదరు ఎస్‌ఐని వీఆర్‌కు పిలిచి తన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

# నేర నియంత్రణలో ఘనంగా..

- సీసీ కెమెరాలతో దొరుకుతున్న నేరగాళ్లు
- వైపాలెం నియోజకవర్గంలో 561 ఏర్పాటు
- కేసుల ఛేదనకు మార్గం సులువు

3




దర్శిలో సిద్ధమైన రైల్వే స్టేషన్

# దర్శిలో త్వరలో రైలు కూత!

- ఇప్పటికే లైన్, ప్లాట్‌ఫాం, వంతెన నిర్మాణాలు పూర్తి
- మరో 200 మీటర్ల లైన్ మాత్రమే మిగిలింది

3

## ఆయకట్టుకు జీవం

(మొదటిపేజీ తరువాయి)

నీటి సరఫరాతో అన్ని పనులు చేపట్టేందుకు వీలు కాలేదు. దీంతో వచ్చే సీజన్‌కు సాగర్ కాలువలకు నీరు వచ్చేలోపు అలాంటి పనులు చేపట్టి పూర్తిచేయాలని నిర్ణయించింది. అందుకోసం అత్యవసరంగా చేయాల్సిన పనులను నివేదించాలని ఏప్రిల్‌లో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు జిల్లాల అధికారులను ఆదేశించారు.

తక్షణం పనులు చేపట్టాలి

ఒంగోలు సర్కిల్ పరిధిలో బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి డివిజన్‌లోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో 78 పనులకు రూ.2.58 కోట్లు మంజూరు చేశారు. తక్షణం ఈ పనులను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజా ప్రభుత్వం వచ్చాక సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిన నేపథ్యంలో ప్రస్తుతం మంజూరు చేసిన పనులను వాటి ద్వారానే చేయించాలని అధికారులను ఆదేశించింది. గతంలో రూ.5లక్షల పనుల వరకే నామినేషన్ పద్ధతిపై చేసే అవకాశం ఉండగా, దానిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచింది. ప్రతిపాదించిన పనులన్నీ రూ.10లక్షలలోపే ఉండటంతో సాగునీటి సంఘాల నుంచి తీర్మానాలను తీసుకొని వారికి అధికారులు పనులు ఇచ్చే అవకాశం ఏర్పడింది. తద్వారా తక్షణం ఆ పనులు చేపట్టి కాలువల్లో నీరు వచ్చేలోపుగా పూర్తి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. కాగా ఎక్కడైనా సంఘాలు ఈ పనులను చేపట్టేందుకు ముందుకు రాకపోతే స్వల్పకాలిక టెండర్లు పిలిచి చేయించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది.

## విఠలాపురం

## సర్పంచ్‌పై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించారు. దీంతో రమేష్, కాలేషాలు కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. బిల్లుల చెల్లింపులో ఏర్పడిన వివాదంపై హైకోర్టు సమగ్ర విచారణకు ఆదేశించింది. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులమేరకు పంచాయతీ రాజ్ ఎస్‌ఈ క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఈవిచారణలో వివాదంలో ఉన్న రూ.54,68,835 బిల్లులకు సంబంధించిన పనులను రమేష్, కాలేషావళిలు చేశారని, ప్రభుత్వపరంగా ఆనిధులను పంచాయతీకి జమచేయగా సర్పంచ్ దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించారు. హైకోర్టు ఆదేశానుసారం అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ విఠలాపురం సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డిపై క్రిమినల్ కేసు, ఆర్‌ఆర్ యాక్టు తక్షణమే అమలు చేసి నిధులను రికవరీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ చర్యలకు ఉపక్రమించారు. ఆమేరకు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ సర్పంచ్‌పై పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోయింది.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పందిళ్లపల్లి(చీరాల), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామం నాగవరపమ్మ ఆలయం సమీపంలో చెట్ల మధ్య గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతదేహం గుర్తించలేని విధంగా ఉంది. వయసు సుమారు 55-60 మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

## గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, జూన్2 (ఆంధ్రజ్యోతి) : వివాహితను శారీరకంగా, మానసికంగా వేదిస్తున్నారని మార్టూరులోని సంపత్‌నగర్‌కు చెందిన గుంజి వాసంతి అనే వివాహిత భర్త అత్తలపై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్‌ఐ సైదా తెలిపారు. ఆయన కథనం ప్రకారం వాసంతికి ఇడుపులపాడు గ్రామానికి చెందిన దర్గాప్రసాద్‌తో 2021 లో వివాహమైంది. అయితే కొంతకాలం నుంచి వాసంతిని వేధిస్తుండగా గృహహింసపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఆర్టీసీ డిపోలను కుదవపెట్టి అప్పులు తెచ్చిన జగన్

**వైసీపీ హయాంలో సంస్థ అస్తవ్యస్తం**

**బస్‌లు డొక్కు అయినా స్పందన శూన్యం**

**మరో 950 కొత్త బస్‌లకు ప్రతిపాదనలు పంపాం**

**జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి**



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఆర్టీసీ సంస్థ అస్తవ్యస్తంగా మారి, అభివృద్ధికి నోచుకోలేదని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి విమర్శించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల పనితీరు, అధికారుల నిర్లక్ష్యంతోపాటు క్యాంటీన్‌లలో అధిక ధరలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ఆర్టీసీని నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప అభివృద్ధి అనేది లేదని చెప్పారు. చివరకు డిపోలను కూడా కుదవపెట్టి డబ్బులు తెచ్చారని విమర్శించారు. రోడ్లు సరిగా లేక బస్సులు దెబ్బతిన్నాయని, కార్మికులు తీవ్ర కష్టాలు పడ్డారని, చివరకు అనారోగ్యం బారినపడినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా జీతాలు చెల్లించలేని దుస్థితికి తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఆర్టీసీ నష్టాలకు ముఖ్య కారణం డీజిల్ ధరలు పెరగడమేనని చెప్పారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏపీలో 2900 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. మరో 700 బస్సులు పట్టణాల్లో కేటాయిస్తామని, 3600 బస్సులను పాత వాటికి బదులు ఇచ్చామని చెప్పారు. మరో 950 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆర్టీసీ బస్టాండ్, డిపోలలో పరిశుభ్రత పెంచాలని అధికారులకు చెప్పారు. కాంట్రాక్టర్ల పనితీరు మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విలువైన ఆర్టీసీ బస్టాండ్‌ల స్థలాలను కాపాడుతామని చెప్పారు. మార్కాపురం బస్టాండ్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం, హైదరాబాద్, బెంగళూరు బస్సులు ఆగేచోట నూతన సీసీ ఫ్లాట్‌ఫాంను ఏర్పాటు చేస్తామన్నారు. బస్టాండ్‌లో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సంఘం నాయకులు ఆర్‌కేజే నరసింహం, నల్లాన్ చక్రవర్తుల నరసింహాచార్యులు, మార్కాపురం నుంచి బెంగళూరుకు ఇంద్ర స్లీపర్ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీశైలం నుంచి తిరుపతికి వెళ్లే బస్సులను మార్చాలని, మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు ఉదయంపూట ఒక బస్సును ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నరసింహులు, బీజేపీ నాయకులు వీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

# కనకనాగవరపమ్మ శిడిమహోత్సవాలు ప్రారంభం



సంతరావూరు గ్రామంలో అమ్మవారి ఊరేగింపు

చినగంజాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామంలో కనకనాగవరపమ్మ అమ్మ వారి శిడిమహోత్సవ పూజలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సంతరావూరు గ్రామంలోని మీసాల బాబురావు ఇంటి వద్ద ఉన్న అమ్మవారి గిలకల మందిరం వద్ద నుంచి కనకనాగవరపమ్మ అమ్మవారిని మేళతాళాలు, కనకతెప్పట్లులతో ఊరేగింపుగా అమ్మవారి నిధి వద్దకు చేర్చారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిడిమహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. 3వ తేది రాత్రి సంతరావూరు గ్రామంలోని నాయిని శేషగిరి ఇంటి నుంచి అమ్మవారు సముద్రస్నానానికి బయలుదేరడం, 4వ తేది రాత్రి గ్రామంలో కనక నాగవరపమ్మ కళానాట్యమండలి వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, 5, 6 తేదీలలో గ్రామంలో గ్రామస్థులు, ఒంగోలుకు చెందిన దివంగత కొత్తగర్ల వెంకటేశ్వర్లు సోదరులు, కుమారుల ఆర్థిక సహకారంతో కొలుపులు(వేడుకలు) నిర్వహించనున్నారు, 7న గ్రామంలో అమ్మవారి పొంగళ్ల జరుపు కొని వడ్డిపాలెం పోలేరమ్మ మందిరం వద్ద నుంచి సాయంత్రం గ్రామం నుంచి శిడిబండి బయలుదేరి రావూరుపేటలోని అమ్మవారి గుడి వద్దకు చేర్చుట, 8, 9 తేదీలలో పరిసర గ్రామాల్లో అమ్మవారి జోగి కార్యక్రమాలు, 10వ తేది అమ్మవారి శిడిమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

# మహనీయుని ఆశయ సాధనకు కృషి

### ఘనంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల - పేరాల ఉద్యమ కారులు, మహనీయులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్ర హానికి పూలమాలలు వేసి నివళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లా డుతూ గోపాలకృష్ణయ్య ఆశయాలను ముందు కు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, సర్విశెట్టి సుబ్బరామయ్య, అర్వపల్లి కుమార్, వేణుగోపాల్, కోట వెంకటేశ్వరరెడ్డి, సురేష్, శివప్రసాదరావు, రమేష్, గజవల్లి శ్రీనివాసరావు, నాగవీరభద్రా చారి, బీరం సుందరరావు, రాధాకృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

ఆంధ్రరత్న, ప్రముఖకవి, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలు వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చీరాల ప్రాంతంతో దుగ్గిరాలకు ఉన్న సంబంధాలను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, ప్రసాద్, వీరాంజనేయులు, సుబ్బారావు, పూర్ణ, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




గోపాలకృష్ణయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

## ఖబరస్తాన్‌కు నిధుల మంజూరుపై హర్షం

నాగులపాలెం(పర్చూరు) , జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబరస్తాన్) అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గ్రామంలోని మసీదు వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో షేక్.కరిముల్లా, షేక్.షయాజ్, షేక్.షుకూర్, మౌలాలీ, మాబూబాషా, బాజిసైదా, ఖాదర్‌బాషా,ఖాజా, అబ్దుదల్ వహీద్, బాజీవలి, సుభానీ రన్‌హుస్సేన్ పాల్గొన్నారు.

## పాండురంగ స్వామి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విఠల్‌నగర్‌లోని రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయానికి సోమవారం వ్యాపారవేత్త, స్వామి భక్తుడు హైదారాబాదుకు చెందిన కుంచాల ఏడుకొండలు రూ.1,01,100 నగదును విరాళంగా అందజేశారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్రాంత ఎంపీడీవో శ్రీరామచంద్రమూర్తి, ఉడతా శంకరరావు, తన్నీరు రామారావు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పర్చూరు ఆర్టీసీ బస్టాండ్

- పెచ్చులూడి గాయపడుతున్న ప్రయాణికులు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- మురుగునీటి నిల్వలతో దుర్గంధభరితంగా ప్రాంగణం

పర్చూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల మంది ప్రయాణికులతో రాకపోకలు సాగించే పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ శిధిలావస్థకు చేరి ప్రమాద భరితంగా తయారైంది. భవనం స్లాబ్‌లు పెచ్చులు ఊడిపడి ప్రయాణికులు గాయాలు పాలవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు వివిధ మండ లాలకు ప్రధాన కూడలిగా ఉంది. దీంతో చీరాల, చిలకలూరిపేట, నర్సరావుపేట, గుంటూరు, విజయ వాడ, హైదరాబాద్, ఇంకొల్లు తదితర మార్గాలకు వెళ్లే బస్సులు పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ నుండే రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న బస్టాండ్ శిథిలావస్థకు చేరుకొని ప్రమాదభరితంగా ఉన్నా అధికారులు కన్నెత్తి చూడకపోవటంపై ప్రయాణికులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అడవిని తలపిస్తున్న ప్రాంగణం

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం చుట్టూ చిల్లచెట్లు, ముళ్లపొదలు పేరుకుపోయి అడవిని తలపిస్తోంది. దీనికి తోడు మందుబాబుల వీరంగం కూడా తోడు కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంటుందోనని ప్రయాణికులు భయపడుతు న్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంది. దీంతో రాత్రి సమయా ల్లో ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

### నిరుపయోగంగా మరుగుదొడ్లు

మరుగుదొడ్లు నిరుపయోగం గా మారి చిల్లచెట్లతో పేరుకు పోయి ఉన్నాయి. దీంతో అత్యవ సర పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.




పెచ్చులూడిన శ్లాబు కింద కూర్చున్న ప్రయాణికులు

### పెచ్చులూడి పడి ప్రమాదాలు

పర్చూరులో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి మూడు దశాబ్దాలు కావడంతో భవనం పూర్తిగా దెబ్బతింది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో భవనంపై స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి శిధిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండ్‌కు కనీస మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ఇనుపచువ్వలు బయటపడ్డ శ్లాబు, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డు, చిల్లచెట్లతో నిండిన ప్రాంగణం

**అవీఇవీ**

## గ్రామ కమిటీల ఏర్పాటుతో కిసాన్ మోర్చా బలోపేతం

**రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి**




మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కిసాన్ మోర్చాను గ్రామ స్థాయిల్లో పటిష్ట పరిచేందుకు కమిటీలను నియమించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి చెప్పారు. స్థానిక వివేకానంద విద్యాపీఠం పాఠశాలలో ప్రకాశం జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ కిసాన్ మోర్చా బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రైతుల సంక్షేమం కోసం మోదీ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రైతుల సమస్యలపై కిసాన్ మోర్చా నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి సన్నారెడ్డి సురేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, నాయకులు పీవీ కృష్ణారావు, ఎస్.సరోజిని, ఎం.లక్ష్మీ, జీవీ రెడ్డి, చిన్నయ్య, సతీష్, శ్రీధర్, మోర్చా నాయకులు రామకృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, బాదరయ్య, ప్రతాప్ రెడ్డి, సూర్యనారాయణ, ఉన్నం శీను, పి.నారాయణ పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకం కోసం స్థల పరిశీలన

**మూడు వేల ఎకరాలకు అందనున్న సాగునీరు**



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు,జూన్ 2,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో నూతనంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు సోమవారం ఇరిగేషన్ అధికారులు స్థల పరిశీలన చేశారు. గొనసపూడి వంతెన సమీపంలో కొమ్మమూరు కాల్వపై ఎత్తిపోతలు నిర్మించి భీమవరం సమీపంలోని దుద్దుకూరు 3వ మైనరులో నీటిని ఎత్తిపోసేందుకు విశ్రాంత ఇరిగేషన్ అధికారి సత్యనారాయణ స్థలాన్ని పరిశీలించారు. భీమవరం, గొనసపూడి, ముప్పాళ్ల రైతులతో సమావేశమై చర్చించారు. ఈ ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు నిధులు కూడా మంజూరైనట్లు సత్యనారాయణ తెలిపారు. ఇక్కడ నిర్మించే ఎత్తిపోతల పథకంతో సుమారు మూడు గ్రామాల పరిధిలోని మూడు వేల ఎకరాలకు సాగు నీరందించవచ్చన్నారు. ఆయన వెంట ఈఈ భాగ్యలక్ష్మీ, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాటిబండ్ల శ్రీరామూర్తి, చలిచం సాంబయ్య, రాఘవయ్య, కోట కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## గోశాలకు ఆవుల తరలింపు


- నెరవేరిన దుద్దుకూరు గ్రామస్థుల కోరిక



గోశాలకు వెళుతున్న ఆవులు

ఇంకొల్లు, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని దుద్దుకూరులో గోవధకు తరలిస్తున్న గోవులను గ్రామస్థులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. గ్రామస్థుల ఐక్యతతో అధికారుల సమక్షంలో వీటిని సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలో నందగోవుల ట్రస్టుకు తరలించారు. నాలుగు రోజులుగా వీటిని గ్రామంలోనే ఉంచి గోశాలకు తరలించాలని గ్రామస్థులు పట్టుబట్టారు. సోమవారం ఉదయం పశువైద్యులు గోవులకు పరీక్షలు నిర్వహించి అనంతరం పోలీసులు, గ్రామస్థుల సమక్షంలో వాహనాన్ని ఏర్పాటు చేసి 9 ఆవులను క్షేమంగా తరలించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. గోవుల ప్రాణాలు కాపాడిన దుద్దుకూరు గ్రామస్థులను ఆర్‌ఎస్‌ఎస్ కార్యాకర్తలు, అధికారులు అభినందించారు.

## శిథిలమైన బావితో పొంచి ఉన్న ప్రమాదం



రహదారి మధ్యలో ఉన్న బావి

పాపాయిపాలెం (చీరాల), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయి పాలెం గ్రామంలో ప్రమాదం పొంచి ఉంది. గ్రామ ప్రధాన రహదారి వెంబడి శిథిలమైన బోరు బావి ప్రమాద భరితంగా ఉంది. అది సుమారు 15 అడుగుల లోతులో మురుగు నీరు చేరి, బావిముందు అంచులు శిథిలమయ్యాయి. అంతేకాకుండా అతి తక్కువ ఎత్తులో ప్రమాదభరితంగా ఉంది. ఆ రహదారిలో విద్యుత్ దీపాల సౌకర్యం కూడా అంతంత మాత్రమే. పల్లెటూరు కావడంతో రాత్రి సమయంలో చిన్నారులు ఆటలాడుతుంటారు. ఈక్రమంలో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వాహనదారులు సైతం ఆ పరిసరాల్లో తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తలు చేట్టాలని లేకుంటే సమస్యలు చవి చూడాల్సి వస్తుందని చెబుతున్నారు.

## నివేశన స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి



ర్యాలీ చేస్తున్న పేదలు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రాష్ట్రప్రభుత్వం అందించే నివేశన స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జెల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుండి పట్టణంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్నారు. నిరాశ్రయులకు ప్రతి ఒక్కరికి పట్టణంలో వారికి రెండు సెంట్లు, గ్రామీణ వాసులకు మూడు సెంట్లు అందించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెల్లి విల్సన్, జిల్లా సభ్యులు బత్తుల శామ్యూల్, మేడా వెంకటరావు పాల్గొన్నారు.



మండలాల వారీగా ఏర్పాటైన సీసీ కెమెరాలు
ఎర్రగొండపాలెం - 230
దోర్నాల - 83
పుల్లలచెరువు - 60
పెద్దారవీడు - 73
త్రిపురాంతకం - 115

సీసీ కెమెరాలతో దొరుకుతున్న నేరగాళ్లు
● నియోజకవర్గంలో 561 ఏర్పాటు
● కేసుల ఛేదనకు మార్గం సులువు

ఒకప్పుడు తప్పుచేసిన నేరగాళ్లు కన్నుగప్పి తిరుగుతున్నారు అనేవాళ్లు. కానీ ఇప్పుడు మనుషుల కళ్లుగప్పి తప్పించుకోవచ్చేమే కాని సాంకేతికతను దాటుకొని వెళ్లలేరని కొన్ని ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎక్కడికక్కడ ఏర్పాటైన నిఘానేత్రాలు నేరం చేసి తప్పించుకుపోయేవారిని ఇట్టే పట్టిస్తున్నాయి. ఎస్పీ ఆదేశాలతో ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎస్‌ఐలు వారి మండలాల్లో అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో నేరగాళ్లను సులువుగా పట్టుకునేందుకు అవే ఇప్పుడు పోలీసులకు మార్గదర్శకాలుగా మారాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో ప్రధాన కూడళ్లు, జంక్షన్ రహదారుల వద్ద నిఘానేత్రాలు ఏర్పాటయ్యాయి. కొంతమంది దాతల సహకారంలో ఈ కార్యక్రమాన్ని పోలీసులు చేపట్టి సఫలీకృతమయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇప్పటివరకు 561 కెమెరాలను వివిధచోట్ల ఏర్పాటు చేశారు. ఇటీవల పలు కేసుల్లో నేరస్తులను ఈ కెమెరాలే పట్టించాయి.
- త్రిపురాంతకం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

# నేర నియంత్రణలో ఘనంగా..

### రూ.14లక్షల సొత్తు చోరీ.. మూడు రోజుల్లో దొరికిన దొంగ


స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల పరిధిలో ట్రాక్టరు, నీళ్ల ట్యాంకరు, ట్రాక్టరు ట్రక్కు, రోటోవేటర్ తదితర వస్తువులు దొంగతనంగా రాత్రిపూట ఎత్తుకెళ్లినట్లు ఏప్రిల్ 13న పుల్లలచెరువు, త్రిపురాంతకం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కేసు నమోదు చేశారు. వీటివిలువ మొత్తం రూ.14.60లక్షలు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మొట్టమొదట కేసు ఛేదనకు పరిశీలించినది సీసీ కెమెరాలనే. త్రిపురాంతకం మండలం మేడపి వద్ద ఉన్న సీసీ కెమెరా ఆధారంగా దొంగ వినుకొండ వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఏ దారుల్లో ఎన్ని గంటల సమయంలో దొంగ ఈ వాహనాలను, సామగ్రిని ఎటువైపు తరలించిన సంగతి ఇట్టే తెలిసిపోవటంతో అతని ఆచూకీ తెలుసుకునేందుకు సులువైంది. ఆ దొంగ పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురానికి చెందినవాడిగా నిర్ధారించారు. అతనివద్ద నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. ఇదంతా కేవలం మూడురోజుల్లోనే పోలీసులు ముగించారు. దీనంతటికీ పోలీసులకు ఉపయోగపడింది ఈ నిఘానేత్రాలే.

### ప్రమాదం చేసి ఆపకుండా వెళ్లినా..

● పెద్దారవీడు మండలంలో ఇటీవల ఒక వాహనం రోడ్డు ప్రమాదానికి కారణమై ఆపకుండా వెళ్లిపోయింది. దానిని కూడా పోలీసులు సీసీ కెమెరాల సహకారంలో గుర్తించి నంద్యాల వద్ద పట్టుకుని తీసుకొచ్చారు. పుల్లలచెరువు మండలం మల్లాపాలెం సమీపంలో తెల్లవారుజాము సమయంలో గొర్రెల మందపైకి ఒక లారీ దూసుకెళ్లి గొర్రెలను చంపటమే కాకుండా గొర్రెల కాపరి మరణానికి కూడా కారణమైంది. లారీ ఆపకుండా వెళ్లిపోయినప్పటికీ సీసీ ఫుటేజీతో లారీని గుర్తించి పోలీసులు తేలికగా వాహనాన్ని పట్టుకున్నారు.

● మిస్సింగ్ కేసులను కూడా సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు సులువుగా చేదిస్తున్నారు. ఇలా పలు కేసుల ఛేదనకు సీసీ కెమెరాలు దోహదపడుతున్నాయి. అందుకే కొందరు ప్రైవేటు వ్యాపారులు కూడా వారి వ్యాపార సముదాయాల వద్ద ఇప్పుడు సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని గుర్తించి ఏర్పాటు చేసుకుంటున్నారు. నిజంగా ఇవి నిఘా నేత్రాలే.

### నిఘానేత్రాలను తప్పించుకోలేరు



తప్పు చేసి తప్పించుకోవాలనుకునేవారిని నిఘా నేత్రాలు చాలావరకు పట్టిస్తున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు. ఎస్పీ సూచనలతో కెమెరాల ఏర్పాటులో 90 శాతం సక్సెస్ అయ్యాం. ఇంకా కొన్ని ఏర్పాటు చేయటం వల్ల ఉపయోగం ఉంటుంది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.
- ప్రభాకరరావు, సిఐ, ఎర్రగొండపాలెం


దర్శిలో నిర్మించిన రైల్వేస్టేషన్ భవనం

## దర్శిలో త్వరలో రైలు కూత!

● ఇప్పటికే రైల్వేలైన్, ప్లాట్‌ఫాం, వంతెన నిర్మాణాలు పూర్తి
● మరో 200 మీటర్ల లైన్ మాత్రమే మిగిలింది

దర్శి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. నడికుడి నుంచి కనిగిరి వరకు దాదాపు రైల్వేలైను నిర్మాణం పూర్తయింది. దర్శి-పొదిలి మధ్యలో కేవలం 200 మీటర్లు మాత్రమే రైల్వేలైను నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. దర్శిలో నూతన రైల్వేస్టేషన్ ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. నూతన భవనం, ప్లాట్‌ఫాం, రైల్వేట్రాక్ దాటేందుకు వంతెన నిర్మించారు. వంతెనపై రేకులు వేయాల్సి ఉంది. త్వరలో రైళ్లు నడిపేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలుసార్లు ట్రయల్ రన్ నిర్వహించిన విషయం తెలిసిందే. వచ్చే ఆగస్టు నుంచి శ్రీకాళహస్తి- కనిగిరి రైళ్లు నడిపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న దర్శి ప్రాంత వాసుల కల త్వరలో నెరవేరనుంది. ఈ రైలు ప్రయాణ వసతి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ వెళ్లేందుకు, తిరుపతి వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. వీలైనంత త్వరలో రైళ్లు నడిపించాలని ఇప్పటికే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పలుసార్లు రైల్వే అధికారులను కోరారు. గత జనవరిలోనే రైళ్లు నడుపుతామని అధికారులు తెలిపినప్పటికీ కొన్ని పనులు పూర్తి కాకపోవటంతో జాప్యం జరిగింది. ఈ సారి అనుకున్న గడువు ప్రకారం రైళ్లు నడిపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**ఆ 200 మీటర్లే ఆటంకం**

దర్శి-పొదిలి మధ్యలో రైల్వేలైన్‌లో భూమి కోల్పోయిన కొంతమంది రైతులు నష్టపరిహారం విషయంలో అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించారు. అందువల్ల అక్కడ పనులు చేపట్టలేదు. ప్రస్తుతం నడికుడి నుంచి కనిగిరి వరకు రైల్వేలైను పూర్తయింది. మధ్యలో 200 మీటర్లు కూడా పూర్తి చేసేందుకు అధికారులు సంబంధిత రైతులతో మాట్లాడుతున్నట్లు తెలిసింది. వీలైనంత త్వరలో పనులు పూర్తిచేసి రైళ్లు నడిపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

## కె.బిట్రగుంటలో చోరీ

జరుగుమల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బిట్రగుంట గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన వల్లెపు అంజమ్మ, వేటగిరి ప్రశాంతి ఇళ్ల తాళాలు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... రెండిళ్లలోని బీరువా తాళాలు పగులగొట్టి 2 తులాల బంగారం, రూ.36వేలు నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి దంపతులపై దాడిచేసి..

● వేటపాలెంలో అగంతకుడి దుశ్చర్య


గాయాన్ని చూపుతున్న గ్రేస్‌లత

వేటపాలెం (చీరాల), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి దంపతులను తన బైకుతో ఢీకొట్టి అనంతరం వారిపై దాడిచేసి పరారైన ఘటన వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్కాపురంలో సిటీ మిషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న కవల ఎలీషా గతంలో చీరాల మెప్మా విభాగంలో పనిచేశారు. ఆయన భార్య గ్రేస్‌లత పుట్టిల్లు వేటపాలెం మండలం మంకెనవారిపల్లి కావడంతో ఆదివారం రాత్రి ఒంగోలు నుంచి వేటపాలేనికి ఆర్టీసీ బస్సులో వచ్చారు. వేటపాలెం వద్ద జాతీయ రహదారిపై దిగి నడుచుకుంటూ వీరు ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి వేగంగా వెనుక నుంచి వచ్చి ఏలీషా భార్య గ్రేస్‌లతను ఢీకొట్టాడు. ఆమె కిందపడింది. రక్తగాయాలయ్యాయి. భర్త ఎలీషా నిలదీయడంతో వాగ్వాదం నడిచింది. దంపతులిద్దరిపైనా దుండగుడు దాడి చేశాడు. ఇద్దరికీ గాయాలయ్యాయి. బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. పోలీసులు ఘటనపై వివరాలు నమోదు చేసుకున్నారు.

## మామ ఇంట్లో అల్లుడు చోరీ

● పట్టించిన వేలిముద్రలు ● 12 గంటల వ్యవధిలో నిందితుడు అరెస్టు

ఒంగోలు క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, మద్యానికి బానిసగా మారి ఆటో కిస్తీలు కట్టేందుకు కూడా డబ్బులు లేక దొంగతనానికి పాల్పడి పోలీసులకు దొరికిపోయాడు ఓ ఆటోడ్రైవర్. తొలి ప్రయత్నంలో సొంత మామ ఇంటికి కన్నం వేసి రూ.2.40 లక్షల సొత్తును కొట్టేశాడు. అయితే ఇంట్లో దొంగలు పడి సొత్తు దొచుకెళ్లినట్లు సీన్ చిత్రీకరించాడు. దొంగతనం జరిగిన 12 గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకున్నామని ఒంగోలు రూరల్ కార్యాలయంలో సీఐ యన్.శ్రీకాంత్ బాబు సోమవారం వివరాల ప్రకారం.. సంతనూతలపాడులో రజక బజారు లక్ష్మీ నివాసంలో ఉంటున్న నీలం మోహన్ గతనెల 31 రాత్రి ఇంటికి తాళం వేసి చిలకపాడు వెళ్లాడు. ఆయన వచ్చేసరికి ఇంటి తాళం పగలకొట్టి బీరువా తాళం తీసి బట్టలు చిందరవందరగా పడవేసి బంగారం ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. రూరల్ సీఐ ఈనెల 1న ఘటనా స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు. తాళ్లూరు మండలం శివరామపురానికి చెందిన పొదిలి బ్రహ్మయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ సంతనూతలపాడులో ఉంటున్నాడు. నీలం మోహన్ చిన్న కుమార్తెను వివాహం చేసుకున్నాడు. దీంతో మామ ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన బ్రహ్మయ్య దొంగతనం చేయాలని ఇంటి తాళం పగలకొట్టి ఇంట్లో బీరువా తాళం ఉన్న స్థలం ముందే తెలియడంతో, తాళాలు తీసి బంగారం ఆభరణాలను అపహరించుకు వెళ్లాడు. వేలిముద్రలు సేకరించిన తరువాత అనుమానం వచ్చి బ్రహ్మయ్య వేలిముద్రలు సరిచూడగా మరింత అనుమానం కలిగింది. మంగళవారం సంతనూతలపాడు బస్టాండ్‌లో అనుమానస్పదంగా ఉన్న బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకొని విచారించిన తరువాత దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ఉదయ్ కుమార్, కానిస్టేబుల్ నారాయణరెడ్డిలను డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు అభినందించారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

## ఇంజన్లు, ట్యాంకర్లతో మురుగు తొలగింపు


మురుగు నీటిని ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అద్దంకి, జూన్2 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు ముందుకు కదలకుండా నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వాసవీనగర్‌లో ఎన్ఎస్‌పీ కాలువలోకి సమీప ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరి నిల్వ ఉంటోంది. భవానీ సెంటర్‌లో చెక్‌పోస్టు వద్ద కూడా మురుగునీరు ముందుకు కదలకుండా నిలిచి ఉంది. ఏళ్లతరబడి ఇదే సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో కమిషనర్ రవీంద్ర ప్రత్యేక దృష్టి సారించారు. వాసవీనగర్‌లో మురుగును ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న సైడ్‌డ్రైన్‌లోకి పంపింగ్ చేస్తున్నారు. భవానీ సెంటర్‌లో మురుగును పంపింగ్ చేసే వీలులేక ట్యాంకర్‌లోనికి పంపింగ్ చేసి తరలిస్తున్నారు. మురుగు నీటి పంపింగ్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి పరిశీలించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగింది.

## కనిగిరి దంపతులకు అనాథ బాలిక అప్పగింత

ఒంగోలు నగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేకపోవటంతో స్థానిక బాలసదన్‌లో ఆశ్రయం పొందుతూ చదువుకుంటున్న బాలికను కనిగిరికి చెందిన దంపతులు సోమవారం సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. కె.శిరీష ఆరవ తరగతి నుంచి బాలసదనమ్‌లో ఉంటూ చదువుకుంటోంది. పదవ తరగతి చినగంజాంలోని కేజీబీవీ పాఠశాలలో చదివి ఇటీవల పరీక్షల్లో 549 మార్కులు సాధించింది. చదువులో చురుగ్గా ఉన్న శిరీషను కనిగిరికి చెందిన దంపతులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో ఐసీడీఎస్ అధికారులు సోమవారం అప్పగించారు. కనిగిరిలో కిరాణాషాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావు, పద్మ దంపతులు బాలిక సంరక్షణ బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు రావటంతో ఏడాది పాటు ఆమె సంరక్షణ బాధ్యతలను ఈ దంపతులకు అప్పగించారు. ఏడాది తర్వాత బాలిక, దంపతులు ఇష్టపడితే శాశ్వతంగా దత్తత ఇచ్చే ప్రక్రియను ఐసీడీఎస్ అధికారులు చేపట్టనున్నారు.



విజేతలతో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

## ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక మినీ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, జూనియర్స్ విభాగంలో ఆరుగురు విజేతలుగా నిలిచారు. 59 కేజీల విభాగంలో ముగ్గురు విజయం సాధించారు. 66 కేజీల విభాగంలో ముగ్గురు, 74 కేజీల విభాగంలో 10 మంది విజేతలుగా నిలిచారు. దాంతోపాటుగా 83 కేజీల విభాగంలో ఏడుగురు, 93 కేజీల విభాగంలో ఐదుగురుతోపాటు, పలు విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన మెడల్స్ ప్రదానోత్సవం కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు మెడల్స్ బహూకరించారు.

## దుగ్గిరాల జ్ఞాపకాలను పరిరక్షించండి

● ఆర్డీవోకు వినతి


ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న దుగ్గిరాల అభిమానులు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మహనీయులు, పోరాట యోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మధుర జ్ఞాపకాలను భవిష్యత్తు తరాలకోసం పరిరక్షించాలని పలువురు కోరారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పోరాట యోధుని జ్ఞాపకాల కోసం' కథనంపై పలువురు ఉద్యోగులు, అభిమానులు స్పందించారు. చీరాల, ఈపూరుపాలెంకు చెందినవారు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనను ఖననం చేసిన ప్రదేశం శిథిలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అక్కడ దుగ్గిరాల స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తామే స్వచ్ఛందంగా స్థూపం నిర్మిస్తామన్నారు. అందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఆర్డీవో ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో మాట్లాడారు. ఆ ప్రదేశాన్ని పరిశీలించి, ప్రణాళిక సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవోను కలిసిన వారిలో నీలం శ్రీనివాసరావు, షేక్ జమాల్ బాషా, దాసరి రాజ్‌కుమార్, రాము, ధనుంజయ, ఆదినారాయణ, చంద్రశేఖర్, నాశన శివాజీ, మోహన బ్రహ్మం తదితర ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

## నరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సింగరాయకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సోమవారం రాత్రి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రికి దేవదాయశాఖ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించేవిధంగా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కృష్ణవేణి, టీడీపీ నాయకులు మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్కా బ్రహ్మేశ్వరరావు, మురళి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

## ముగిసిన మూల్యాంకనం

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం ముగిసింది. మూడు రోజుల పాటు ఇంగ్లీషు, సంస్కృతం, గణితం, పీఎస్, బీఎస్, సోషల్ జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది.

### నేటినుంచి డీఆర్పీలకు శిక్షణ

జిల్లా స్థాయి రిసోర్స్‌పర్సన్లు (డీఆర్పీలు) శిక్షణా కార్యక్రమం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు స్థానిక పీవీఆర్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. డీఆర్పీల శిక్షణకు 150 మంది టీచర్లను నియమించామన్నారు. వీరికి 14 మంది స్టేట్ రిసోర్స్ గ్రూపు శిక్షణ ఇస్తుంది. నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. డీఆర్పీలుగా నియమితులైన 150 మంది తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలని ఆయన కోరారు.

## అవీ..ఇవీ


అవగాహన కల్పిస్తున్న అధికారులు

### పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాలుష్య నియంత్రణమండలి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నియంత్రించి, గుడ్డ సంచులను వాడాలని తెలిపారు. ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఒంగోలు రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులకు ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా కళాజాతర, రైల్వే శాఖ సహకారంతో ర్యాలీ, స్టేషన్ ఆవరణంలోని పార్కునందు జీవన వైవిధ్యానికి సంబంధించిన మొక్కలను నాటి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ నంద కిషోర్, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శరణం చంద్రారెడ్డి, ప్రయాణికులు పాల్గొన్నారు.


నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేస్తున్న పూర్ణచంద్రరావు

### వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

కొండపి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరిదేపి గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల నేతలు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, పోటు శ్రీనివాసరావు, పెరిదేపి గ్రామ మాజీ సర్పంచ్‌లు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, సోమేపల్లి కోటేశ్వరరావు, రావిపాటి వెంకటరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విద్యార్థి మిత్ర కిట్లను చూపుతున్న డీఈవో, మండల విద్యాధికారులు

### విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ ప్రారంభం

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం, రూరల్ మండలాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లను పాఠశాలలకు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. స్థానిక రామనగర్‌లోని మునిసిపల్ హైస్కూలులో విద్యార్థిమిత్ర స్టాక్ పాయింట్‌ను డీఈవో పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలకు విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మండల విద్యాధికారులు టి.కిషోర్‌బాబు, పి. సరస్వతి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

### ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలి

పొన్నలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామం వద్ద పాలేరు నుంచి ఇసుక తరలింపును నిలువరించాలని జనసేన నాయకులు తహసీల్దార్ వి. పుల్లారావును కోరారు. ఈమేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి భారీగా ఇసుకను అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, నాయకులు పత్తిపాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రజియా సుల్తానా

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నాగులుప్పలపాడు, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద ఎస్ఐ రజియా సుల్తానా సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి ప్రశాంతంగా జీవించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

**- కలెక్టర్ అన్సారియా హెచ్చరిక**

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాలచుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి అర్జీలను స్వీకరించిన కలెక్టర్ ఆయా అర్జీలపై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ప్రతిరోజు లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టంచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, కుమార్, జాన్సన్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి, వివిధశాఖల జిల్లా అధికారులు ఉన్నారు.


మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

#### మద్దిపాడులో ఒక అర్జీ

మద్దిపాడు :తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి పెద్దకొత్తపల్లి గ్రామం నుంచి భూమి సర్వే చేయాలని అర్జీవచ్చినట్లు తహసీల్దార్ నారాయణ రెడ్డి తెలిపారు. తక్షణమే భూమికి సంబంధించిన కొలతలను పరిష్కరించాలని ఆయన వీఆర్వోను ఆదేశించారు.

### అధికారులకు మాస్కుల పంపిణీ

ఒంగోలులోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాస్కులను పంపిణీ చేశారు. ఒంగోలులో రెండు పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యశాఖ సిబ్బంది ఈ మాస్కులను పంపిణీ చేశారు.గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లానలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు అధికంగా వస్తున్న నేపథ్యంలో అధికారులకు ఈ మాస్కులు పంపిణీ చేశారు.


మీకోసంలో మాస్కులతో వివిధ శాఖల అధికారులు

## జేఈఈలో శ్రీప్రతిభ విద్యార్థి సత్తా

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో స్థానిక శ్రీ ప్రతిభ విద్యార్థి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించారు. ఎస్‌సీ కేటగిరిలో కాటూరి హరినాథ్ జాతీయ స్థాయిలో 994వ ర్యాంకు సాధించారు. ఈ విద్యార్థికి ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థ ఐఐటీలో ప్రవేశం లభించనుంది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హరినాథ్‌ను ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణలు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

#### ఎస్ఆర్ కళాశాల విద్యార్థి సత్తా

స్థానిక ఎస్ఆర్ కళాశాల విద్యార్థి దాసరి గగన్ కుమార్ జాతీయ స్థాయిలో 1,857 ర్యాంకు సాధించారు. గగన్‌కుమార్‌ను ఎస్ఆర్ జీఎం రాజేంద్రప్రసాద్, అకడమిక్ డీన్ శంకర రావు, ప్రిన్సిపాల్ బాలరాజులు అభినందించారు.

ఒంగోలు నగరానికి చెందిన రాజు వెంకటహాసిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 2,237 ర్యాంకు సాధించి తన సత్తాను చాటారు. హాసిని ఎన్‌జీవో నాయకుడు కృష్ణారెడ్డి కుమార్తె. ఉత్తమ ర్యాంకు సాధించిన హాసినిని పలువురు అభినందించారు.


దాసరి గగన్‌కుమార్


రాజు వెంకటహాసిని

### శ్రీ సరస్వతి విద్యార్థుల విజయకేతనం

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఐఐటీల్లో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఒంగోలు శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సరస్వతి కళాశాల విద్యార్థి ఎం. రఘునాథ్ జాతీయస్థాయిలో పీడబ్ల్యూడీ విభాగంలో మూడవ ర్యాంకు సాధించారు. బి.మణికంఠబాబు 119, కేలోత్‌క్రితి 1,343 ర్యాంకు సాధించారు. కళాశాల విద్యార్థులు పది మంది ఐఐటీ ప్రవేశాలకు అర్హత సాధించారు. ఈసందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్లు గంగా శంకర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్‌లు అభినందించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులను కూడా అభినందించారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

**● కలెక్టర్ తమీమ్ అన్సారియా**

ఒంగోలు(రూరల్),జూన్2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, ప్రతిగా గుడ్డ సంచులు,నారసంచులు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఒంగోలు కలెక్టరేట్‌లో సోమవారం ప్లాస్టిక్ సంచులు నివారించి జనపనారసంచులు వాడాలని సూచించే వాల్ పోస్టర్‌లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడకం వలన పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో కాలుష్యనియంత్రణ మండలి ఇంజనీర్ రాఘవరెడ్డి, ప్రొటెస్ట్ సంస్థ కార్యదర్శి శరం చంద్రారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధి వీరభద్రాచారి, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు

#### కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలి

కౌలురైతులు తప్పక సీసీఆర్‌సీ కార్డులుపొంది ఉండాలని మండల వ్యవసాయఅధికారి జి .కిషోర్‌బాబు అన్నారు. ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వీఆర్‌వోలు, వీవోఏలతో సమావేశం జరిగింది.ఈసమావేశంలో వ్యవసాయఅధిదికారి జి.కిషోర్‌బాబు మాట్లాడుతూ సొంత భూముల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధారకార్డు, కౌలురైతు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలన్నారు.

### స్పౌజ్ టీచర్లకు రూల్స్ పాటింపజేయాలి

ఒంగోలు(రూరల్),జూన్2(ఆంధ్రజ్యోతి):స్పౌజ్ గల టీచర్లకు రూల్స్ ప్రకారమే బదిలీలు ఉండాలని నాన్ స్పౌజ్ టీచర్స్‌ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీఈవో కార్యాలయంలో డీఈవో కిరణ్‌కుమార్‌కు నాన్ స్పౌజ్ టీచర్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పౌజ్‌కు దగ్గరగా గల పోస్టులు మాత్రమే కోరుకోవాలన్నారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రూల్స్‌కివ్యతిరేకంగా బదిలీలకు స్పౌజ్ ల అర్జీలుఉన్నట్లయితే చర్యలు ఉంటాయని వారికి తెలిపారు.ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎఫ్ నాయకులు సోమెపల్లి హనుమంతరావు, కాట్రగడ్డ మాధవి, చప్పిడి కేశవరావు, అమర శ్రీనివాసరావు, దామాసుబ్బారావు, చప్పిడి శ్రీను, దామా రామాంజనేయులు, కందులగంగాధర్, ఆరే శ్రీనివాసరావు పాల్గొన్నారు


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాన్‌స్పౌజ్ టీచర్లు

### రేపటి ర్యాలీని విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వ్యతిరేకపాలనను నిరసిస్తూ ఒంగోలులో ఈనెల 4వతేదీన నిరసనతో పాటు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తూనే ఉందన్నారు. పరిపాలనను, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన ర్యాలీలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. అంతకుముందు వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు లంకపోతు అంజిరెడ్డి, మన్నె శ్రీనివాసరావు, కఠారి శంకర్ తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరణలో వైసీపీ నేతలు

### రేపు ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ లో ఈనెల 4న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాలక్ష ఎంవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9703165456 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

### రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒంగోలు రానున్నారు. ఆరోజు ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

### దేవదాయ భూములను సబ్ డివిజన్ చేయాలి

మద్దిపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేవదాయ భూములను త్వరితగతిన సబ్ డిజన్ చేయాలని మద్దిపాడు తహసీల్దార్ నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం లింగంగుంట గ్రామం సర్వే నెంబర్ 69లో ఉన్న దేవాలయ భూములు సబ్ డివిజన్ చేసి విడదీయాలని సూచించారు. రైతులు రిజిస్ట్రేషన్ కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, రెవెన్యూ సమస్యలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సర్వేయర్లు భూమి కొలతలను పారదర్శకంగా తీసి సబ్ డివిజన్ చేయాలన్నారు. అలాగే పెద్దకొత్తపల్లి గ్రామంలో దేవదాయ భూములను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

### వితంతువులకు ఆర్థిక సహాయం

వితంతువులకు ఆర్థిక సహాయం అందజేస్తూ గ్రామంలో తమదైన సేవాభావం చాటుతున్నారు తెలుగుదేశం కార్యకర్తలు. ఇనమనమెళ్లూరు గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి భర్తలు చనిపోయిన పేద మహిళలను 18మందిని గుర్తించి సొంత నిధులతో నాలుగు నెలల నుంచి నెలకు 1000 ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తెదేపా నాయకులు దొప్పా సుబ్బయ్య నేతృత్వంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నైనాల భావన్నారాయణ సహకారంతో ఈ ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్నారు.


ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పేదలు, సీపీఐ నేతలు

## నివేశన స్థలాలు ఇవ్వాలి

**● సీపీఐ ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా**

ఒంగోలు(రూరల్), జూన్2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని వారికి 3సెంట్లు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్రనాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చాలన్నారు. ఎన్ అగ్రహారం వద్ద పేదలకు ఇచ్చిన సెంటు స్థలానికి పొజిషన్ చూపించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో పేదలు బతికే పరిస్థితిలేదన్నారు. ఖర్చులు పెరగటంతో గృహాలు నిర్మించుకోలేని పరిస్థితి ఉన్నదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకట్రావు, శ్రీరామ శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్ .రామకృష్ణ, మహిళా నాయకురాలు విజయ, పలువురు పేదలు పాల్గొన్నారు.

#### కొండపిలో

కొండపి : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి కొండపి తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకూ ఇళ్ల పట్టాల ఊసే లేదన్నారు. వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లమంద, ఆశీర్వాదం, రమణమ్మ పాల్గొన్నారు.

### నోబిడ్లతో రైతుల ఆందోళన

మద్దిపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి):వెల్లంపల్ల పొగాకు వేలం కేంద్రంలో వ్యాపారులు పొగాకును కొనుగోలు చేయకుండా నోబిడ్‌లతో చెక్కులను వెనక్కి పంపడంతో రైతులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట క్లస్టర్ రైతులు 742 పొగాకు బేళ్ల వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. బేళ్లను కొనుగోలు చేయకుండా నోబిడ్లు పేరుతో వెనక్కు పంపగా రైతులు ఆందోళన చేశారు. వేలంకేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ వ్యాపారులతో మాట్లాడినా వారు 340 బేళ్లను తిరస్కరించారు. అయితే కేవలం 402 బేళ్లు కొనుగోలు చేయగా వేలంను 20 నిమిషాల పాటు ఆపివేశారు. తిరిగి చర్చల అనంతరం వేలం కొనసాగించి గరిష్ఠ ధర 280, కనిష్ఠ ధర 230కి కొనుగోలు చేశారు. రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరి రావు, రావి ఉమామహేశ్వర రావు, మండవ గోవిందరాజులు, నవులూరి సురేంద్రమోహన్‌లు రైతులతో చర్చించారు.

#### మలేరియా రహిత మండలంగా మార్చాలి

:మలేరియా రహిత మండలంగా మార్చేలా ప్రతి ఒక్కరు కృషిచేయాలని మలేరియా జిల్లా అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం మద్దిపాడు ఆరోగ్యకేంద్రంలో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచనల మేరకు 2030 నాటికి మలేరియా నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

### డీఈఈసెట్‌కు 80 శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు సోమవారం నిర్వహించి డీఈఈసెట్-25 కు 80శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఏసీ కే శివకుమార్ తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 380 మందికి 304 మంది హాజరు కాగా 76 మంది గైర్హాజరయ్యారు.

### జిల్లాలో భారీగా మొక్కలు నాటాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వతేదీన జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని జాయింట్ కలెక్టర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడారు. మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు యోగాంధ్ర క్యాంపెయిన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందుకు అనుగుణంగా ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. 2029 నాటికి రాష్ట్రంలో పచ్చదనం 50 శాతానికి పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. జిల్లాలో 35.75 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించామని, అందుకు అనుగుణంగా ఈనెల 5తేదీన 4.10 లక్షల మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు అనంతరం అంశాల వారీగా సమీక్షించి ఆయా శాఖల అధికారులను దిశా నిర్దేశం చేశారు. ఉపాధి పథకం, హౌసింగ్, విద్య, వైద్యం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు రాజశేఖర్, చిరంజీవి, శ్రీనివాసప్రసాద్, జోసెఫ్‌కుమార్, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

## క్రైం సమాచారం


దగ్ధమైన పూరిల్లు


ప్రమాదంలో కాలిపోయిన నగదు

### అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

నాగులుప్పలపాడు, జూన్2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమయింది. యాభై ఏడువేల రూపాయల నగదు, ఇంటి సామగ్రి అగ్నికి ఆహుతయింది. ఈ ఘటన అమ్మనబ్రోలులో చోటుచేసుకొంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు అమ్మనబ్రోలు ముస్లిం కాలనీలో ఒంటిరిగా నివశిస్తున్న వృద్ధురాలు షేక్ కమరున్‌కు చెందిన పూరింటిలో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి.మంటల ధాటికి భయంతో వృద్ధురాలు బయటికి పరుగులు తీసింది. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా వీలుకాలేదు. అగ్ని ప్రమాదంలో ఇంటి యజమానికి చెందిన నగదు రూ. 57 వేల రూపాయలు , ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం అందుకొన్న వీఆర్వో భాగ్యరావ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేశారు.

#### ఆర్థిక సాయం అందజేత

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వృద్ధురాలికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్ రూ. 5,000 ఆర్థిక సాయం, బియ్యం బస్తా అందించారు. విషయాన్ని స్థానిక ఎంఎల్ఏ బీఎన్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా పూర్తి స్థాయిలో ఆదుకొంటామని భరోసా కల్పించారు. అలాగే నిడమానూరుకు చెందిన టీడీపీ నాయకుడు మారెళ్ల శ్రీనివాసులు రూ.10 వేల సహాయాన్ని వృద్ధురాలికి అందజేశారు.

## 4 నుంచి శిక్షణ తరగతులు

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు వివిధ రకాల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా గురూజీ బీఎస్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8 సంవత్సరాల చిన్నారులకు ప్రజ్ఞ, యోగా, ఉత్కర్ష యోగా, 13 ఏళ్ల పైబడిన వారికి మేధా యోగా, 18 ఏళ్ల పైబడిన పెద్దలకు ఆనందమయ యోగా శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణలో పాల్గొనే వారు 9441932390, 7330884066 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## చెట్లను కాపాడాలి

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి చెట్టుగా ఎదిగేవరకూ సంరక్షణ బాధ్యతను తీసుకుంటే వాతావరణ సమతుల్యత త్వరితగతిన సాధించవచ్చని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# శిథిలావస్థలో నీళ్ల ట్యాంకులు

- ఎప్పుడు కూలుతాయోనని ప్రజల భయాందోళన
- ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

పెద్దదోర్నాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర దోర్నాలలో మంచి నీటి కోసం నిర్మించిన వాటర్ ట్యాంకులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో, ఎవరి మీద పడతాయోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 30 దశాబ్దాల కిందట దూపాడు నుంచి సాగర్ జలాలు దోర్నాల ప్రజలకు అందించే లక్ష్యంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో, కూరగాయల మార్కెట్ వద్ద పెద్ద వాటర్ ట్యాంకులను నిర్మించారు. కాగా చుక్క నీరు కృష్ణా జలాలు రాలేదు. కానీ వాటర్ ట్యాంకులు పూర్తిగా పాడైపోయాయి. ట్యాంకులకు మూలాధారమైన పిల్లర్లు దాదాపు పాడై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అవి కూడా తుప్పు పట్టి బలహీనంగా ఉన్నాయి. పిల్లర్లపై ఏర్పాటు చేసిన ట్యాంకులు కూడా పెచ్చులు ఊడి పోతున్నాయి. పాఠశాల ఆవరణలోని ట్యాంకును పంచాయతీ అధికారులు ఇప్పటికీ


బయటకు కనిపిస్తున్న పిల్లర్ ఇనుపచువ్వలు

వినియోగిస్తున్నారు. అయితే తరగతులు జరిగినప్పుడు విద్యార్థులకు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అది ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితి ఉంది. ప్రస్తుతం పాఠశాలకు సెలవు రోజులు కాబట్టి దానిని కూల్చివేసి కొత్త ట్యాంకును నిర్మించాలని కోరుతున్నారు. మార్కెట్ వద్ద ఉన్న ట్యాంక్ వినియోగంలో లేదు. సరికదా ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక్కడ రోజూ వినియోగదారులు మార్కెట్‌కు వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రెండు చోట్లా ట్యాంకులు కూలకముందే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కూరగాయల మార్కెట్ వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంక్

## చెత్త బండిని ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కొంగళవీడు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం వీధికి బండిని ప్రతి రోజు పంపి చెత్తను సేకరించాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ వీధికి బండి రాకపోవడంతో చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయాల్సి వస్తుందని, దాంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నట్లు చెప్పారు. రోగాలు వచ్చే అవకాశమున్న దృష్ట్యా బండిని పంపించి చెత్తను సేకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


యోగాంధ్ర టీ షర్టులను అందజేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

## నేడు త్రిపురాంతకంలో యోగాంధ్ర

- 2వేల మంది హాజరయ్యే అవకాశం
- ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్ త్రివినాగ్

త్రిపురాంతకం, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ తెలిపారు. దాదాపు 2 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు, ఉదయం 6గంటలకే కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజలు సకాలంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమం పేరుతో రూపొందించిన టీషర్టులను ఆయన అధికారులకు అందజేశారు.

## నిత్యం యోగా సాధన చేయాలి

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పుల్లయ్య పాల్గొన్నారు. జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ స్ఫూర్తితో యోగా డే నిర్వహించాలని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి, స్థానికంగా ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో యోగా గురూజీ కరుణాకర్‌రెడ్డి, కరాటే మాస్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : యోగా సాధనతో ఆరోగ్యం మెరుగవుతుందని డీఎల్‌డీవో బాలునాయక్ తెలిపారు. ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మండల స్థాయి యోగాంధ్ర పోటీల కార్యక్రమం సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బాలునాయక్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకుని చేస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు చలపతిరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సైదుబాబు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం ఈనెల 5వ తేదీన విజయవాడలోని లయోలా కళాశాలలో జరుగనున్న 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభకు తరలి రావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గిద్దలూరు తాలూకా అధ్యక్షుడు వైపీ రంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి ఈ మహాసభకు హాజరై ఉద్యోగుల ఐక్యతను తెలియ చెప్పాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్ బకాయిల చెల్లింపునకు కాల పరిమితితో కూడిన రూట్ మ్యాప్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి షేక్ సంధాని, ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరామయ్య, సంఘ ప్రతినిధులు అల్లూరయ్య, అజయ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం

- నిర్లక్ష్యంగా ఉంటున్న పంచాయతీ అధికారులు
- చెత్త, మురుగు నీటితో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు


గురిజేపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చెత్త అక్కడ, ఎక్కడ మురికి అక్కడ తాండవిస్తోంది. తీవ్రమైన కంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుక్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలోని గురిజేపల్లి, కొలుకుల, గంజివారిపల్లి, బోయలపల్లి తదితర గ్రామాల్లో రహదారుల వెంట చెత్త పేరుకుపోయి తీవ్రమైన కంపు కొడుతోందని స్థానికులు చెప్తున్నారు. అంతే కాకుండా రోడ్ల వెంట రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండడంతో రోగాలబారిన పడుతున్నామని చెప్తున్నారు. మే 30వ తేదీన కేంద్ర బృందం సభ్యులు గురిజేపల్లి గ్రామంలో పర్యటించిన నేపథ్యంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడం చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు, సర్పంచ్‌లు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.


మలేరియాపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శరత్‌చంద్ర

## మలేరియాపై అప్రమత్తం

పొదిలి, జూన్ 2 :ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్‌చంద్ర అన్నారు. మలేరియా నియంత్రణ మాసోత్సవంలో భాగంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో సోమవారం మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ముఖ్యంగా మలేరియా ఒక ప్రాణాంతక వ్యాధి అన్నారు. దీనిని పూర్తిగా నివారించవచ్చన్నారు. వర్షాకాలంలో మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ఇంటినీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## దోర్నాల సొసైటీకి సీఈవోను నియమించండి

**చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన టీడీపీ మండల నాయకులు**


సీతారామయ్యను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దదోర్నాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దోర్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీకి (పీఏసీఎస్) సీఈవోను నియమించాలని టీడీపీ సీనియర్ నాయకుడు బట్టు సుధాకర్ రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీ) చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను కోరారు. నూతనంగా పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సీతారామయ్యను టీడీపీ నాయకులు ఒంగోలులో ఆయన నివాసంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దోర్నాలలో సీఈవోగా పని చేస్తున్న గురవయ్య అనారోగ్యంతో సెలవులో ఉన్నారని, దీంతో రైతులు రుణాలను సకాలంలో చెల్లించక వడ్డీ భారం పెరిగిందని, నూతనంగా రుణాలు తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని కనుక అక్కడ సీఈవోను నియమించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన చైర్మన్ పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు చేపడతామన్నారు. కలిసిన వారిలో షేక్ మంజూర్ బాషా, కాకర్ల శ్రీనివాసులు, కాశీరాములు, కె శ్రీనివాస్ ఉన్నారు.

## పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

కంభం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేసే హమాలీలతో కలిసి సీపీఐ నాయకులు జోసఫ్, డి.పుల్లయ్య తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందచేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వైసీపీ పాలనలో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో సెంటు స్థలం మంజూరు చేయడం వలన గృహ నిర్మాణాలు జరుగలేదన్నారు. ఈ ప్రభుత్వం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.


వైపాలెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

ఎర్రగొండపాలెం : అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు మంజునాథరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ టీడీపీ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

## షాపులోకి దూసుకెళ్లిన బత్తాయి లారీ

పెద్దారవీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బత్తాయి లారీ షాపులోకి దూసుకెళ్లడంతో కూల్‌డ్రింక్, జ్యూస్ షాపులు ధ్వంసమైన ఘటన మండలంలోని దేవరాజుగట్టులో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. పామూరు నుంచి ఢిల్లీ వెళుతున్న లారీ ఆదివారం రాత్రి దేవరాజుగట్టులోని మునగంటి రామనాగాచారికి చెందిన కూల్‌డ్రింక్ షాపు, సుబానీకి చెందిన జ్యూస్ దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో కూల్‌డ్రింక్ షాప్‌నకు రూ.1.5 లక్షలు, జ్యూస్ దుకాణానికి రూ.40వేల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. డ్రైవర్‌కు కళ్లు తిరగడం కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గుర్తించారు. రాత్రి పూట కావడంతో దుకాణాల వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు.


దుకాణంలోకి దూసుకొచ్చిన లారీ

# కౌలుదారులకు గుర్తింపు కార్డు ఇవ్వడమే లక్ష్యం

**తహసీల్దార్ శైలేంద్రకుమార్**

పెద్దారవీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి కౌలుదారునికీ గుర్తింపు కార్డును ఇవ్వడమే లక్ష్యమని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పంట సాగు హక్కుపత్రం - 2019 చట్టం గురించి వీఆర్వోలు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ సహాయకులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 1534 కార్డులు జారీ చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కౌలు కార్డులకు సంబంధించి గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కౌలు కార్డు కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉండడం వలన భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కౌలుదారులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమి మీద కాదన్నారు. కార్యక్రమంలో ఏవో బుజ్జిబాయ్, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో జవహర్‌లాల్ నాయక్

### కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు

పెద్ద దోర్నాల : కౌలు రైతులకూ ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయని, వాటిపై అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి జవహర లాల్ నాయక్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు కిన్నెర శాంతి అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట సాగు యజమానులకు సమానంగా కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అందించే సబ్సిడీ ఫలాలు అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ విషయాన్ని కౌలు రైతులకు తెలియజేయాలని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : కౌలుకు భూములు తీసుకొని పంటలు సాగు చేసే రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యసాయయశాఖ అధికారి పి.నిర్మలాదేవి సూచించారు. సోమవారం కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు కార్డు పొందిన రైతుకు సాధారణ రైతులకు వర్తించే అన్ని పథకాలూ వర్తిస్తాయని చెప్పారు. వీఏఏలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ఎర్రగొండపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎస్. జవహర్‌కు టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన విజయవాడలోని మామిళ్లపల్లి కళావేదికలో సోమవారం కలిసి బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.


ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలుపుతున్న ఎరిక్షన్‌బాబు

## విలువలతో కూడిన విద్య అవసరం

గిద్దలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా విజ్ఞానంతోపాటు వివేకాన్ని కూడా అందించేలా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమానికి పలువురు హాజరై ప్రసంగించారు. విద్యతోపాటు క్రమశిక్షణ అలవరచుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపట్ల వినయ విధేయతలతో ఉండాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఆశయాలు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అర్చన్ సీఐ సురేష్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, వివిధ సంఘాల ప్రతినిధులు రామిరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, ఫరూఖ్ పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : బాలబాలికల్లో విజ్ఞానం పెంపునకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని సచివాలయం మహిళా పోలీస్ శిరీష అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. యోగా, సత్ప్రవర్తన, వాతావరణం, వ్యక్తిత్వ వికాసం, జనరల్ నాలెడ్జ్‌పై వివరించారు. గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.


మార్కాపురంలో మాట్లాడుతున్న మహిళా పోలీస్ శిరీష

# బాల్యం నుంచే అవగాహన పెంచుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బాల్య దశ నుంచే వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సేవా సంఘం, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ పర్యవేక్షణలో నిర్వహించిన వేసవి క్రీడా, నట శిక్షణ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు ఉత్సవాలను నిర్వహించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనంలోనే ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. డాక్టర్ మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం అన్నారు. శారీరక దృఢత్వం ఆరోగ్యానికి బాల్య దశ నుంచే శిక్షణ అవసరం అన్నారు. విద్యార్థులు ఏకపాత్రాభినయ ప్రదర్శనలు, జనపద నృత్యాలు, వివిధ ఏకపాత్రలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పీ.నాగేశ్వరరావు, కార్యదర్శి కె.శ్రీనివాసులు, టీపీ వెంకటేశ్వర్లు, టి.రాంబాబు పాల్గొన్నారు.


అలరించిన విద్యార్థినుల జానపద నృత్యం


విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న డాక్టర్ మాధవరావు

## భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను జరుపుకోవాలి

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి**

పామూరు జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఈనెల 5 నుంచి 13 వరకు జరిగే బ్రహ్మోత్స వాలకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ పద్ధతులలో భక్తి భావంతో తరతరాలుగా గుర్తుండేలా బ్రహ్మోత్సవలను జరుపుకోవా లన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరనాయక్

సీఎస్‌పురం (పామూరు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరనాయక్ హెచ్చరించారు. సీఎస్‌పురం ఎస్ఐగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ నుంచి సీఎస్‌పురం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన ఆర్.సుమన్ ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. ఈసందర్భంగా వెంకటేశ్వరనాయక్ మాట్లాడుతూ మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న దేవస్థా తిరునాళ్లను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

## జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

దొనకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సోమవారం పునఃప్రారంభమైంది. ప్రభుత్వం ఉచితంగా సరఫరాచేసిన పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ కె.ధనుముని విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అర్హతకల్గిన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈఅవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

## దేవస్థాన భూమి కౌలు వేలం

తాళ్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థాన భూమిని కౌలుకు సాగుచేసుకునేందుకు పంగులూరు గ్రూపు దేవస్థాన దేవదాయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 641/2లోని 12 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 2025-2028 వరకు మూడేళ్ల పాటు కౌలుకు భూమి సాగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో దాదాపు 35 మందికిపైగా రైతులు పాల్గొన్నారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన కైపు రామకోటిరెడ్డి 12 ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు ఏడాదికి రూ.1,75,000లకు పాటపాడి దక్కించుకునా న్నరు. గతంలో ఏడాదికి రూ.60వేలు కౌలు ఉంది. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సీసీఆర్సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులు సీసీఆర్సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1305 కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. సీసీఆర్సీ కార్డుల వల్ల కౌలు రైతులకు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. అసైన్డ్ భూముల్లో సాగుచేసే కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇవ్వొద్దని వీఆర్వోలకు సూచించారు. సమావేశంలో ఏవో కె.రాధ, వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## నేటినుంచి మండలస్థాయి యోగా పోటీలు

పామూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల స్థాయిలో మంగళవారం నుంచి ఈనెల 7వరకు యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవోలు ఎల్.బ్రహ్మయ్య, కె.వాణి తెలిపారు. 18 సంవత్సరాలలోపువారికి మంగళవారం సోలో అసనాస్, సూర్యనమస్కార్, ప్రాణాయామం, మెడిటేషన్‌పై పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 6,7, తేదిల్లో యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫి, తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.

## నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.8 లక్షల 70వేలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి చెందిన రెండు ప్రధాన హుండీల ద్వారా రూ.8,69,938 ఆదాయం వచ్చినట్టు నారాయణస్వామి, భైరవకోన దేవస్థాన ఈవోలు నరసింహబాబు, డి.వంశీకృష్ణ తెలిపారు. రెండు నెలలకు సంబంధించి హుండీల సొమ్మును సోమవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నడిరోడ్డులో విద్యుత్ స్తంభం

పీసీపల్లి, జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి గ్రామం పాతబడి సమీపంలో నడిరోడ్డులో విద్యుత్‌స్తంభాన్ని ఏర్పాటు చేశారు. స్తంభం ఏర్పాటుచేసేటప్పుడు గ్రామస్థులు అభ్యంతరం తెలిపినా సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని రోడ్డుపక్కన మార్జిన్‌కు మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను జరుపుకోవాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఈనెల 5 నుంచి 13 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ, రాచరికపు పద్ధతులలో కాకుండా సనాతన హిందూ సంప్రదాయ పద్ధతులలో భక్తి భావంతో తరతరాలుగా గుర్తుండేలా బ్రహ్మోత్సవలను జరుపుకోవాల్సన్నారు. అందుకుగాను దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులదే తుది నిర్ణయంగా ఉండాలన్నారు. స్వామివార్ల రథోత్సవం సందర్భంగా విద్యుత్ తీగలతో అంతరాయం కలగకుండా శాశ్వత ప్రాతిపదికన తీగలను సరిచేయాలన్నారు. పారిశుధ్య పనుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈసందర్భంగా తెలియక కొనుగోలు చేసిన దేవుడి మాన్యంకు సంబంధించిన ప్లాట్‌ను పామూరుకు చెందిన పాబోలు శివ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో రిజిస్ట్రేషన్ పత్రాలను దేవస్థానానికి అప్పగించగా, పలువురు ఆయనను అభినందించారు. దేవుడి ఆస్తులు, భూములను పరిరక్షించాలని ఎమ్మెల్యే ఉగ్ర పేర్కొన్నారు.

సమావేశంలో విద్యుత్ ఈఈ ఉమకాంత్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ షేక్ జిలానిబాషా, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి, ఆలయ ఈవో నరసింహబాబు, నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బి. జయరామిరెడ్డి, బి.నారాయణరెడ్డి కేవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పామూరులో బస్సు డిపో ఏర్పాటుచేయాలి

» ఆర్టీసీ నెల్లూరు రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డికి వినతి


సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కేవీ రమణయ్య తదితరులు

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పామూరులో బస్సు డిపోను ఏర్పాటుచేసి ప్రయాణికుల రవాణా ఇబ్బందులు తొలగించాలని ఆర్టీసీ నెల్లూరు రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య వినతిపత్రం అందజేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం సురేష్‌రెడ్డి పరిశీలించారు. ఇక్కడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఇక్కడినుంచి నిత్యం నెల్లూరు, విజయవాడ, చెన్నై, విశాఖపట్టణం, హైదరాబాద్, బెంగుళూరు, ఒంగోలు, తెలంగాణ తదితర ప్రాంతాలకు వెళుతుంటారని అన్నారు. గత 30 సంవత్సరాల నుంచి డిపో ఏర్పాటు చేస్తామని ఎన్నికలలో వాగ్దానం చేస్తున్నారేగాని కార్యరూపం దాల్చడంలేదన్నారు. పదేళ్లక్రితం బస్టాండ్ సమీపంలో సర్వే నెంబర్ 37/1, 37/8 లో భూమిని సేకరించి ప్రతిపాదనలు పంపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకలు కేవీ సుబ్బారావు, జె.చినసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

### దొనకొండలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటుచేయాలి

దొనకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దొనకొండలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నెల్లూరు రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మార్కాపురంలో జరిగిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరావు, యువమోర్చా నాయకుడు బత్తుల శ్రీనివాసులు దొనకొండలో బస్టాండ్ అవసరాన్ని వివరించారు.

పొదిలి డిపో మేనేజర్‌తో చర్చించి బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని సురేష్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు రొడ్డా వెంకటరావు తెలిపారు.

# డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

» చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

» పలువురు అభినందనలు


డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) బలోపేతానికి కృషి చేస్తానని చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. సోమవారం ఒంగోలులో డీసీఎంఎస్ చైర్మన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, జిల్లా నాయకులు హాజరయ్యారు. ముందుగా కాశిరెడ్డితో డీసీఎంఎస్ మేనేజర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కాశిరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు డీసీఎంఎస్ అన్ని విభాగాల కంటే ఆర్థికంగా బలోపేతంగా ఉండేదన్నారు. అన్నిరకాల సేవలు రైతులకు అందేవని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. తిరిగి గాడిలో పెడతామన్నారు. అనంతరం వెలిగండ్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాశిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ముక్కు పెద్దిరెడ్డి, గవదకట్ల హరికృష్ణ, గొనా ప్రతాప్, గవదకట్ల మాలకొండయ్య, రావి శ్రీనివాసులచౌదరి, కేసరి రమణారెడ్డి, వెంకటశ్రీరాములు, మీనిగ కాశయ్య, చిలకల వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, లక్ష్మణ, చిన్ని, మంగమ్మ, సంపతి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### కాశిరెడ్డికి సన్మానం

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా ఒంగోలులో సోమవారం బాధ్యతలు స్వీకరించిన శ్యామల కాశిరెడ్డిని పామూరుకు చెందిన పలువురు టీడీపీ శ్రేణులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలులో కాశిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపినవారిలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు, మెంటా నరసింహారావు, బండ్ల నారాయణ, తదితరులు ఉన్నారు.

# గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

» రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి కార్యాలయాలకు వెళ్లిన వైనం


గ్రీవెన్స్‌లో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

తాళ్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అర్జీలు తీసుకుని వాటి పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్ సెల్‌కు తాళ్లూరు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతి సోమవారం 13 శాఖలకు చెందిన అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ సెల్‌లో అందుబాటులో ఉండాలి. శాఖలవారీగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాల్సి ఉండగా, అధికారులు రాకపోవటంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అర్జీలు ఇచ్చేందుకు వచ్చినవారు అధికారులు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు.

10.30 గంటల సమయంలో కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్ వీసీ పనిచేయటంలేదని తన గదిలో కూర్చుని కార్యాలయ పనులు చేసుకున్నారు. ఇతర అధికారులకు సమాచారం అందటంతో కొందరు గ్రీవెన్స్‌సెల్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి తమ కార్యాలయాలకు వెళ్లారు.

మధ్యాహ్నం ఒంటిగంట వరకు అధికారులెవరూ గ్రీవెన్స్ సెల్‌లో కూర్చున్న దాఖలాలు లేవు.

# 'హింసను ప్రేరేపించడమే ఉగ్రవాద లక్ష్యం'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి కులం, మతం, ప్రాంతం లేదని, హింసను ప్రేరేపించడమే లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. దేశంలో ఉన్న భిన్నత్వాన్ని రక్షించుకొనేందుకు ప్రజాతంత్రవాదులు ముందుకురావాలన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమైఖ్య సదస్సుకు ఆపార్టీ మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాబు మాట్లాడుతూ పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మృతిచెందడం దురదృష్టకరమన్నారు. అయితే, దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు మోదీ తాకట్టుపెట్టారన్నారు. ఉగ్రవాద కాల్పులను దేశ ప్రజలందరూ ఖండించారన్నారు. ఈ ఘటనను బీజేపీ కార్పొరేట్ మీడియా వక్రీకరించి వాట్సాప్‌లో ట్రోల్‌చేసిన అంశం దేశసమైఖ్యతకు భంగం కల్గించిందని అన్నారు. తద్వార బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో సీపీఎం నాయకులు సయ్యద్ మనీఫ్, ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, రషీద్, సయ్యద్ గౌస్‌బాషా, అల్లాభక్ష్, సీహెచ్ వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ శ్రేణులు

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సయ్యద్ మౌలాలి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ వద్ద జరిగిన దర్నాలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి దూరంగా నివేశ యోగ్యం కాని ప్రాంతంలో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలు మంజూరుచేశారన్నారు. ఇక్కడ లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా పట్టణ ప్రాంలాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.సుబ్బారావు, కె.ప్రభాకర్, ఆర్.సూరిబాబు, పి.మస్తాన్‌రావు, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మార్జిన్‌లు ఆక్రమిస్తే చర్యలు

» దుకాణదారులను హెచ్చరించిన పోలీసులు


హోర్డింగ్‌లను తొలగించాలని దుకాణదారులను హెచ్చరిస్తున్న పోలీసులు

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న రోడ్డు మార్జిన్ ఆక్రమణలను కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో సోమవారం సీఐ ఎం.భీమానాయక్, సిబ్బంది తొలగించారు. స్థానిక మమ్మీ డాడి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు, కనిగిరి, నెల్లూరు, సీఎస్‌పురం రోడ్ల మార్జిన్‌ల వరకు ఆక్రమణలను పంచాయతి సిబ్బందితో కలిసి తొలగించారు. రోడ్డు మార్జిన్‌లు ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు, వాహనాలకు అంతరాయం కల్గించే విధంగా రోడ్లను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పామూరు, వెలిగండ్ల ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.కృష్ణపావని, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు చేయించుకోవాలి


డ్రోన్ ప్రాముఖ్యతను రైతులకు వివరిస్తున్న అధికారులు

దొనకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ టి.మానస అన్నారు. మండలంలోని మంగినపూడి, భూమనపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రీఖరీఫ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏవిధంగా శాస్త్రవేత్తల సలహాలతో సన్నద్ధమవ్వాలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి అందించే వివిధ పథకాల గురించి వివరించారు. వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈపంట నమోదుతో పకృతి విపత్తులతో వచ్చే పంట నష్టాలను పొందవచ్చునని చెప్పారు. అనంతరం కోరమండల్ వారు వ్యవసాయంలో డ్రోన్ యంత్రం ప్రాముఖ్యతను రైతులకు ప్రత్యక్ష్యంగా చూపించారు. కార్యక్రమంలో వీఆర్వో గాలయ్య, వ్యవసాయ సిబ్బంది రాధిక, బి.విక్రాంత్, రైతులు పాల్గొన్నారు.

## తీరుతున్న మూగజీవాల దాహార్తి


నీళ్ల తొట్టెల్లోని నీటితో దాహార్తి తీర్చుకొంటున్న మూగజీవాలు

పామూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లు మూగజీవాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వేసవిలో నాలుగు నెలల పాటు చెరువులు, వాగులు, కాలువల్లో నీటి లభ్యత లభించకపోవడంతో మేత కోసం పొలాలకు వెళ్లే మూగజీవాలు నీటి కోసం పలు రకాలుగా ఇబ్బందులు పడేవి. మూగజీవాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొన్న కూటమి ప్రభుత్వం నీటి తొట్టిల నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో తొట్టి నిర్మాణానికి ప్రభుత్వం రూ.32 వేలు అంచనాతో ఉపాధి నిధులు మంజూరు చేసింది.

పామూరు మండలంలో 37, సీఎస్‌పురం మండలంలో 48 నీటి తొట్లును ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు మండలాల్లో వీటి నిర్మాణ పనులు పూర్తి చేశారు. పొలాల్లో మేతకు వెళ్లిన మూగజీవాలు తొట్టెల్లోని నీటిని తాగి దాహార్తి తీర్చుకొంటున్నాయి. వీటిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవోలు బి.మాల్యాద్రి, శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు.

## నర్రవాడ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ సయానాబేగం తదితరులు

పామూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంల నర్రవాడ శ్రీ వెంగమాంబతల్లి బ్రహ్మోత్సవాలకు కనిగిరి ఆర్టీసీ బస్ డిపో నుంచి జాతర స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహ్మద్ సయానాబేగం తెలిపారు. సోమవారం పామూరు ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే వెంగమాంబ తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. అలాగే, కనిగిరి డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. ఈఅవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాలకు, జన్మనిచ్చిన జన్మభూమికి ఆర్థికంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు సహకారం అందించి ఆదుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం గెట్ టు గెదర్ నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులైన జె.గోవిందయ్య, ఎంఈవో హరిబాబు, వీరాంజనేయులు, శర్మను సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకం నగదు బహుమతి అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో జేఎస్ ఆనంద్, షేక్ రజ్జబ్‌బాషా, తిరుమలశెట్టి సిద్ధు, జి.ధనేంజయ, యోగిరెడ్డి, లక్ష్మీనారాయణ, షకిల్, శారద, సుప్రజ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.





ఉష్ణోగ్రత (అంచనా)

| 3-6-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 39 | 28 |
| తెనాలి | 39 | 28 |
| నరసరావుపేట | 40 | 28 |
| బాపట్ల | 39 | 28 |
| రెంటచింతల | 40 | 28 |
| చీరాల | 39 | 29 |


# అప్పుడు ఇప్పుడూ సమిధలు వారే!

పల్నాడు జిల్లా ఫ్యాక్షన్ గ్రామాల్లో అటు వైసీసీ ప్రభుత్వంలో.. ఇటు కూటమి ప్రభుత్వంలో బాధితులు, సమిధలు టీడీపీ కార్యకర్తలే. అప్పుడు వైసీసీ నేతలు అధికారం చలాయిస్తే.. ఇప్పుడు అనధికారికంగా పోలీసు అధికారులను అడ్డుపెట్టుకుని వారే తమ ఆధిప త్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కేసులున్నా తప్పించు కుంటున్నారు.. టీడీపీలో కోవర్టులతో తమ వ్యతిరేక వర్గాలను తప్పిస్తు న్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతున్నా.. పిన్నెల్లి సోదరుల పిడికెట్లోనే అరాచకాలు కొనసాగుతున్నాయి.

## ప్రభుత్వం మారినా.. అధికారం వారిదే!

- అధికారంలో ఉన్నా.. హతులు టీడీపీ వారే
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీస్ యంత్రాంగం
- చీమ చిటుక్కుమన్నా ఆ పార్టీ నేతలకు సమాచారం
- నాటి హత్యలు, అనుమానాస్పద మరణాలపై విచారణలేవీ?
- ఫ్యాక్షన్ గ్రామాల్లో నేటికీ భయం గుప్పిట్లో టీడీపీ శ్రేణులు
- ఫ్యాక్షనిస్టులను తలపించేలా అప్పట్లో పోలీసుల వ్యవహారం
- సమగ్ర విచారణ జరిపితే సగం మంది పోలీసులు ఇంటికే





గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో గడిచిన పదేళ్లు టీడీపీ శ్రేణులు దిన దిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు కాలం గడిపారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వంలోనూ మాచర్ల ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఆ ఐదేళ్లూ.. ఆయన అరాచకాలకు అప్పటి ప్రభుత్వం కళ్లెం వేయలేక పోయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పిన్నెల్లి సోదరులు మరింతగా రెచ్చిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీ ఘన విజయంతో కొలువుదీరింది. మాచర్ల ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు మంచి రోజులు వచ్చాయని భావించారు. కానీ, నియోజకవర్గంలో పోలీస్ శాఖలో పెద్దగా మార్పు లేదు. నేటికీ వైసీపీ నాయకుల కనుసన్నల్లో పోలీస్ యంత్రాంగం పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ చీమ చిటుక్కుమన్నా వైసీపీ నాయకులకు తెలిసిపోతోందని, పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా వారికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుపై టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

### నాటి అరాచకాలపై చర్యలేవి?

వైసీపీ 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోనే.. పల్నాడులో అరాచకాలకు తెగబడింది. ఎంతో మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఆత్మకూరు టీడీపీ శ్రేణులను గ్రామ బహిష్కరణ చేయడం సంచలనం సృష్టించింది. అప్పట్లో చంద్రబాబు చలో ఆత్మకూరుకు పిలుపునివ్వగా అధికార పార్టీ ఆదేశాలతో పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. చివరకు ఆయన ఇంటి గేటుకు తాళాలు వేసి నిర్బంధం అమలు చేశారు. చివరకు విజయవాడకు చెందిన టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌లపై వైసీపీ నేత, పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ చేసిన హత్యాయత్నం.. పల్నాడులో నెలకొన్న దారుణ పరిస్థితులను బాహ్య ప్రపంచానికి చాటిచెప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిలో 12 కేసుల్లో బెయిల్ తెచ్చుకునే వరకు కూడా పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయకపోవడం పల్నాడు పోలీసుల పని తీరును ప్రశ్నిస్తోంది.

### హత్యకు ముందు ఓ ఎస్సై రెక్కీ

తోట చంద్రయ్య హత్య కుట్రలో ఓ ఎస్సై పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. హత్యకు (మిగతా 6వ పేజీలో)

### తోట చంద్రయ్య హత్యలో పోలీసు కుట్ర

వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 13న వైసీపీ గూండాలు అత్యంత దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. జై జగన్ అంటే ప్రాణాలతో వదిలేస్తామని వైసీపీ రౌడీలు చంద్ర య్య గొంతు పై కత్తి పెట్టినప్పటికీ.. జై చంద్రబాబు అనడంతో దారుణంగా హతమార్చారు. చంద్రయ్య అంత్య క్రియలకు హాజరైన నాటి ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆయన పాడె మోశారు. పార్టీ కార్య కర్తల్లో భరోసా నింపడానికి ప్రయ త్నించారు. చంద్రయ్య హత్యకేసు విచా రణను గత ప్రభుత్వంలో తూతూ మంత్రంగా చేపట్టారు. ఈ హత్య వె నుక కుట్రలు, కుతంత్రాలతో పాటు నే టికీ బహిర్గతం కాని పోలీసుల ప్రత్యక్ష పాత్ర ఉండటం కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రయ్య హత్య కేసులో పిన్నెల్లి బ్రదర్స్ పాత్ర ఉందని గుర్తించి, వారిని కూడా నిందితుల జాబితాలో చేర్చి, కేసును సీఐడీకి బదిలీ చేశారు.



చంద్రయ్యను హత్య చేస్తున్న వైసీపీ నేతలు (పాత చిత్రం)



అద్దంకి సమీపంలో జరుగుతున్న విజయవాడ- బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

# వేగంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

పరిహారం చెల్లింపులో ఆలస్యం ● ఆందోళనలో రైతులు

అద్దంకి,జూన్2(ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగళూరు జాతీయ రహదారిలో ముప్పవరం నుండి కొడికొండ వరకు గ్రీన్ ఫీల్డ్(కొత్తగా నిర్మాణం చేసే) జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. పంగులూరు మండలం ముప్పవరం నుంచి ప్రారంభమయ్యే ఈ జాతీయ రహదారి అద్దంకి పట్టణం సమీపం నుంచి అద్దంకి మండలంలోని పలు గ్రామాల పొలాల మీదగా వెళ్తోంది. ఈ క్రమంలో అద్దంకి ప్రాంతంలో పనులు ఒకింత ఆలస్యంగా ప్రారంభమైనా వేగవంతంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంతో భూములు కోల్పోయే కొంత మంది రైతులకు పరిహారం రెండు సంవత్సరాల క్రితం చెల్లించి పనులు ప్రారంభించారు. అయితే మరికొంత మంది రైతులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. ఒక వైపు హైవే నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండడం పరిహారం చెల్లింపులో ఆలస్యం కావడంతో భూములు కోల్పోయిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి పలువురు రైతులు తీసుకెళ్లారు. పరిహారం అందని రైతుల వివరాలు వెంటనే సేకరించాలని, అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళికి ఫోన్ చేసి సూచించారు. అయినా క్షేత్ర స్థాయిలో అధికారులలో కదలిక రాలేదు. దీంతో రైతులలో ఆందోళన మరింత పెరిగింది. పంగులూరు, అద్దంకి మండలాల పరిధిలో సుమారు 50 ఎకరాలకు పైగా భూమికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అద్దంకి పట్టణం సమీపంలో ఉన్న భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో పరిహారం కూడా ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిహారం చెల్లింపు జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### పరిహారం వెంటనే చెల్లించాలి



కొంతమంది రైతులకు రెండేళ్ల క్రితం పరిహారం చెల్లించి జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంకా చాలా మందికి పరిహారం అందలేదు. ఈ విషయాన్ని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లాం. వెంటనే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- రావూరి రంగయ్య, అద్దంకి



మోపిదేవి వీరరాఘవయ్య కాలనీలో సీసీ రోడ్డు దుస్థితి

# కీ వాల్స్ వేశారు.. రోడ్డు మరిచారు



ఎక్స్‌మిలటరీ కాలనీలో దెబ్బతిన్న కీవాల్

రేపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీప్రభుత్వ హయాంలో గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధి ఆర్భాట ప్రకటనలే కానీ, ఆచరణలో సాధ్యం కాలేదు. నిజాంపట్నం హార్బర్ రోడ్డులోని మోపిదేవి వీర రాఘవయ్య, ఎక్స్ మిలటరీ కాలనీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లను కీవాల్స్‌తో సరిపెట్టారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు వేయకుండానే అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై డబ్బులు తినేశారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండేళ్ల క్రితం రోడ్లను అభివృద్ధి పరుస్తామని ఒక్కో రోడ్డుకు రూ.4లక్షల నుంచి రూ.5లక్షలు మంజూరు చేశారని ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసినట్లు చెబు తున్నారు. కీవాల్స్ ఛిద్రమై ఎక్కడికక్కడ పగిలిపోతున్నాయంటూ మధ్యలో వేసిన మట్టి బురదమయంగా మారింది. ఆ బురదలోనే ఎక్స్ మిలటరీ కాలనీలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే రహదారులను అభివృద్ధి చేయాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

# బీటీ.. రాష్ట్రం దాటి!

- నిషేధిత బీటీ-3 పత్తి విత్తన విక్రయాలు
- గుంటూరులో తయారీ.. తెలంగాణలో అమ్మకాలు
- మహబూబ్‌నగర్‌లో పట్టుబడుతున్న వైనం
- ఇక్కడ ప్యాకెట్ రూ.600, అక్కడ రూ. 1,500 విక్రయం
- మామూళ్ల మత్తులో వ్యవసాయశాఖ
- తనిఖీలు ఉండవు.. కేసులు లేవు



గుంటూరు

నకిలీ, నిషేధిత విత్తనాల ప్రాభవం రాష్ట్రాలను దాటిపోతోంది. మొలవని, మొలిచినా కాపునకు రాని విత్తనాలతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులను గుల్ల చేసిన వ్యాపారుల సామ్రాజ్యం తెలంగాణకూ విస్తరించింది. ఇక్కడ తయారు చేసిన బీటీ-3 పత్తి విత్తనాలను రాష్ట్ర సరిహద్దులోని జిల్లాలకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడిలో గుంటూరు జిల్లాకు చెందిన బీటీ-3 విత్తనాల డంపు పట్టుపడడం కలకలం రేపుతోంది.

గుంటూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుండెపూడిలో పట్టుబడిన బీటీ-3 విత్తనాలను గుంటూరు నుంచి తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నట్లు సురేష్ అనే వ్యాపారి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అక్కడ జరిపిన విచారణలో చాలా విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లాకు కూడా ఎక్కువ మొత్తంలో బీటీ-3 నిల్వలు గుంటూరు నుంచి వెళ్లినట్లు సమాచారం. వాస్తవానికి బీటీ-3 వినియోగంపై ప్రభుత్వ నిషేధం ఉంది. వాటి వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుంది.

### ఆటోనగర్ నుంచి లాంచెస్టర్ వరకు..

గుంటూరు నగర పరిధిలోని ఆటోనగర్, లాంచెస్టర్ రోడ్డులో కొన్ని విత్తన కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీ లు ఉన్నాయి. అక్కడ కొన్ని రకాల పత్తి విత్తనాలు ప్రాసెసింగ్ పేరుతో యానిట్లు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని విత్తనాలు కూడా అక్కడ ప్రాసెసింగ్ జరుగుతోంది. ముఖ్యంగా బీటీ-3 తయారీ ఈ ప్రాంతంలోనే ఎక్కువగా జరుగుతోంది. అక్కడ ఎవరు బీటీ-3 విత్తనాలు.. ఎవరు నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నారో వ్యవసాయ శాఖ దగ్గర కచ్చితమైన సమాచారం ఉంది. అక్కడ తయారు చేసిన బీటీ-3 విత్తనాలు (మిగతా 6వ పేజీలో)

### నమూనాలు తీస్తే ఒట్టు

నగర పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ సంస్థలు, అమ్మకాలు జరిపే వారి నుంచి ప్రతి ఏడాది ఇన్ని నమూనాలు తీయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. కానీ ఏ ఒక్క విభాగం లోనూ లక్ష్యానికి అనుగుణంగా నమూనాలు సేకరించలేదు. అయినా సదరు అధికారులపై చర్యలూ తీసుకోలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీఎండీ పి.పుల్లారెడ్డి

# సూర్యఘర్‌కు ప్రాధాన్యం

- విద్యుత్‌శాఖ సీఎండి పి.పుల్లారెడ్డి
- బాపట్ల జిల్లాకు లక్ష టార్గెట్

బాపట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి ప్రాధాన్యమిచ్చి పనిచేస్తున్నట్లు విద్యుత్ శాఖ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. బాపట్ల ఎస్ఈ కార్యాలయంలో పథకంపై సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సబ్సిడీతో సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. దీనిపై ప్రజలు నుంచి స్పందన తక్కువగా ఉందని చెప్పారు. కాబట్టి అధికారులకు టార్గెట్లు ఇచ్చి ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 1,100 యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్‌లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, 3 కిలోవాట్‌లకు పైబడిన విద్యుత్ వినియోగదారులకు రూ.78వేలు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని సీఎండీ తెలిపారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ నుండి రుణం ఇప్పిస్తామని చెప్పారు. అవసరమైన ప్రతి ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి మూడు నెలలో అన్ని పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో కొత్తగా ఐదు సబ్‌స్టేషన్‌లు మంజూరు అయినట్లు తెలిపారు. అద్దంకిలో 2, యద్దనపూడిలో ఒకటి ఏర్పాటు చేశామన్నారు. ఇంకా 10 చోట్ల సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెలా రూ.55 కోట్ల విద్యుత్ బిల్లులు డిమాండ్ ఉందని, రూ. 100 కోట్ల బకాయిలు ఇంకా ఉన్నాయని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే లైన్‌లాస్ 9.5శాతం నుండి 8.2శాతానికి తగ్గించటం జరిగిందన్నారు. ప్రతి నెలా ఏఈలు రెండు ఫీడర్లు తనిఖీ చేయాలని ఆదేశించామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే సర్వీస్‌లకు మొత్తం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నట్లు సీఎండీ పుల్లారెడ్డి వెల్లడించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ బి.మురళికృష్ణ, ఎస్ఈ ఆంజనేయులు, చీరాల ఈఈ థామస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు.

# సమాజ హితమే లక్ష్యం

- లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్ష
- జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్ల మనోగతం

గుంటూరు (విద్య) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్షతో కృషి చేశారు. జాతీయ స్థాయిలో లక్షల మంది పోటీ పడే పరీక్షల్లో తమ సత్తా చాటి.. అత్యున్నత ర్యాంకులు సాధించారు. సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించి తమ కలల్ని సాకారం చేసుకునేందుకు తొలి అడుగు వేయనున్నారు. సాంకేతిక విద్యలో అగ్రగామి ఐఐటీల్లో చేరనున్నారు. జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లను "ఆంధ్రజ్యోతి" పలకరించింది.

### సైబర్ నేరాలకు అడ్డుకట్ట



ఎస్.వెంకట సాయి చక్రి

సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యం సాధించి నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని జేఈఈ అడ్వాన్స్‌లో 33 ర్యాంకు సాధించిన ఎస్.వెంకట సాయి చక్రి వెల్లడించారు. ముంబై ఐఐటీలో సీఎస్‌సీ పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ పై పరిశోధన చేయనున్నట్లు వివరించారు. ర్యాంకు సాధన కోసం తల్లిదండ్రులు సుజాతా శ్రీరామూర్తి, అధ్యాపకులు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపకరించాయని తెలిపారు.

### ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు



ఎం శ్రీకరగణేష్

జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని 104వ ర్యాంకు సాధించిన ఎం శ్రీకర్ గణేష్ తెలిపారు. తాను బెంగళూరులోని ఐఐఎస్‌లో బీటెక్ పూర్తి చేసి పరిశోధనల వైపు వెళ్లడమే (మిగతా 6వ పేజీలో)



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

# పీజీఆర్ఎస్‌పై అధికారులు ఆడిట్ చేయాలి

- కలెక్టర్ వెంకటమురళి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 142 అర్జీలు

బాపట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌పై అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 142 మంది అర్జీల ద్వారా సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. తన పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించి కొన్నింటిని పరిశీలనకు, మరికొన్నింటిని విచారించాలని సంబంధితాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారమైతే అర్జీదారులకు లిఖితపూర్వకంగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. తెలుగుభాషలోనే వాటిని జారీ చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు క్విజ్, వక్తృత్వ తదితర 15 రకాల పోటీలు నిర్వహించాలన్నారు. 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయిలో పోటీలకు పంపాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియేట్ విద్యా మండలికి అనుబంధంగా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలు వేసవి సెలవులు అనంతరం సోమవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కే. ఆంజనేయులు, ఆర్ఐవో సైమన్ విక్టర్‌లు సోమవారం తెలిపారు. అదే విధంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేస్తామన్నారు. పుస్తకాలు ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరాయి. విద్యార్థులు కళాశాలల్లో చేరిన వెంటనే వారికి అందజేసేలా ఏర్పాట్లు చేశారు.

## ఐదుగురికి హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఐదు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీచేశారు. సోమవారం అర్హులైన స్కూలు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించి ఆ పోస్టులను ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. గతనెల 30న నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన మూడు, మే 31న రిటైర్డ్‌మెంట్ ద్వారా వచ్చిన రెండు ఖాళీలను కలిపి నింపారు. సీనియార్టీ జాబితా సీరియల్ నెంబరు 141 నుంచి ఉన్న స్కూలు అసిస్టెంట్లతో ఈ పోస్టులు భర్తీచేశారు. ప్రస్తుతం జడ్పీ యాజమాన్యంలోని హైస్కూళ్లలో ఒక హెచ్ఎం పోస్టు కూడా ఖాళీగా లేదు. జిల్లాలో బదిలీల ద్వారా 101 మంది ఉద్యోగోన్నతుల ద్వారా మొత్తం 88 మంది కలిపి 189 హైస్కూళ్లకు కొత్త హెడ్మాస్టర్లు బాధ్యతలు స్వీకరించినట్లు అయింది.

## సారు.. స్టేషన్‌కు రారు

**ఎస్ఐ కోసం మూడు గంటలు వేచి ఉన్న సీఐ**

**కొనకనమిట్ల ఎస్ఐ రాజకుమార్‌ను వీఆర్‌కు పిలిచిన ఎస్పీ**

ఒంగోలు క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు రాకుండా బయట సెటిల్‌మెంట్లు చేసుకుంటూ తిరుగుతున్న కొనకనమిట్ల ఎస్ఐ రాజకుమార్‌పై వేటు పడింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం అతనిని వీఆర్‌కు పిలిచారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎవరికైనా అత్యవసరమై ఫోన్ చేసినా తీయని పరిస్థితి ఉందని కొనకొనమిట్ల మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సివిల్ పంచాయితీలు బయట చేయడం పరపాటిగా మారిందని ఆరోపణలు చేస్తున్నారు. సార్ ఎస్ఐ గారు ఎక్కడ ఉన్నారు.. అని నేరుగా కొందరు సీఐకి ఫోన్ చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆదివారం వెళితే ఆయన మూడు గంటలు వేచి ఉన్నా ఎస్ఐ రాలేదు. దీంతో వెంటనే ఎస్పీకి సీఐ సమాచారం ఇచ్చారు. అదేక్రమంలో గతంలో కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో వెంటనే సదరు ఎస్ఐని వీఆర్‌కు పిలిచి ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

## నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.8.70 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి చెందిన రెండు ప్రధాన హుండీల ద్వారా రూ.8,69,938 ఆదాయం వచ్చినట్లు నారాయణస్వామి, భైరవకోన దేవస్థాన ఈవోలు నరసింహబాబు, డి.వంశీకృష్ణ తెలిపారు. రెండు నెలలకు సంబంధించి హుండీల సొమ్మును సోమవారం లెక్కించారు.

# ఆర్టీసీ డిపోలను కుదవపెట్టి అప్పులు తెచ్చిన జగన్

**వైసీపీ హయాంలో సంస్థ అస్తవ్యస్తం**

**బస్‌లు డొక్కు అయినా స్పందన శూన్యం**

**మరో 950 కొత్త బస్‌లకు ప్రతిపాదనలు పంపాం**

**జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి**



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఆర్టీసీ సంస్థ అస్తవ్యస్తంగా మారి, అభివృద్ధికి నోచుకోలేదని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి విమర్శించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల పనితీరు, అధికారుల నిర్లక్ష్యంతోపాటు క్యాంటీన్‌లలో అధిక ధరలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ఆర్టీసీని నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప అభివృద్ధి అనేది లేదని చెప్పారు. చివరకు డిపోలను కూడా కుదవపెట్టి డబ్బులు తెచ్చారని విమర్శించారు. రోడ్లు సరిగా లేక బస్సులు దెబ్బతిన్నాయని, కార్మికులు తీవ్ర కష్టాలు పడ్డారని, చివరకు అనారోగ్యం బారినపడినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా జీతాలు చెల్లించలేని దుస్థితికి తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఆర్టీసీ నష్టాలకు ముఖ్య కారణం డీజిల్ ధరలు పెరగడమేనని చెప్పారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏపీలో 2900 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. మరో 700 బస్సులు పట్టణాల్లో కేటాయిస్తామని, 3600 బస్సులను పాత వాటికి బదులు ఇచ్చామని చెప్పారు. మరో 950 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆర్టీసీ బస్టాండ్, డిపోలలో పరిశుభ్రత పెంచాలని అధికారులకు చెప్పారు. కాంట్రాక్టర్ల పనితీరు మెరుగపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విలువైన ఆర్టీసీ బస్టాండ్‌ల స్థలాలను కాపాడుతామని చెప్పారు. మార్కాపురం బస్టాండ్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం, హైదరాబాద్, బెంగళూరు బస్సులు ఆగేచోట నూతన సీసీ ఫ్లాట్ ఫాంను ఏర్పాటు చేస్తామన్నారు. బస్టాండ్‌లో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సంఘం నాయకులు ఆర్‌కేజే నరసింహం, నల్లాన్ చక్రవర్తుల నరసింహాచార్యులు, మార్కాపురం నుంచి బెంగళూరుకు ఇంద్ర స్లీపర్ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీశైలం నుంచి తిరుపతికి వెళ్లే బస్సులను మార్చాలని, మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు ఉదయంపూట ఒక బస్సును ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నరసింహులు, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

# సమాజ హితమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యమని వివరించారు. ఇందులో తన తల్లిదండ్రులు పద్మజ, భాను కృష్ణమూర్తి ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

**సివిల్స్ సాధించడమే కోసం**



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసిన తర్వాత ఐఏఎస్ కోసం సివిల్స్ సన్నద్ధం కానున్నట్లు 108వ ర్యాంకర్ ఎస్.ఆకాష్ వెల్లడించారు. ర్యాంకు సాధన కోసం రోజుకు 12గంటలుపైగా చదివినా ఒత్తిడిలేని విధానంలో పరీక్షలకు సన్నద్ధం అయినట్లు తెలిపారు. తల్లిదండ్రులు వసంత, వీరపునాయుడు ప్రోత్సాహంతో లక్ష్యం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

**సెమీ కండక్టర్ విభాగంలో రాణించాలి**



ఐఐటీలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత సెమీ కండక్టర్స్‌పై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలు చేయాలనేది లక్ష్యమని 146వ ర్యాంకు సాధించిన ఇ.విక్రంలేవి తెలిపారు. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ బ్రాంచ్‌లో బీటెక్ పూర్తి చేస్తానని తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు**



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసి.. పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు చేయడం లక్ష్యమని 151 వ ర్యాంకర్ జస్వంత్ బాలాజీ వెల్లడించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి తన వంతు చేయూత అందిస్తానని చెప్పారు.

**వైజ్ఞానిక పరిశోధనలే లక్ష్యం**



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో గణితం, కంప్యూటర్ విభాగంలో బీటెక్ పూర్తి చేసి పరిశోధనలు చేయడమే లక్ష్యమని 152వ ర్యాంకర్ సాయి మనోజ్ఞ తెలిపారు. బెంగళూరులో ఉన్న ఐఐఎస్‌లో బీటెక్ చేయాలని ఆసక్తి ఉందన్నారు. బీటెక్ తర్వాత వైజ్ఞానిక అంశాలపై పరిశోధనలు చేయడం లక్ష్యమని వివరించారు.

# అప్పుడు.. ఇప్పుడు.. సమిధలు వారే!

(మొదటి పేజీ తరువాయి)

ముందు రోజు రాత్రి పిన్నెల్లి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గుండ్లపాడు వచ్చి వైసీపీ నేత, ఆ కేసులో ప్రధాన నిందితుడు చింతా శివరామయ్యను ఆయన ఇంటిలోనే కలసి వెళ్లాడు. అప్పుడే చంద్రయ్య హత్యకు ముహూర్తం పెట్టినట్లు పోలీస్ శాఖ నిర్ధారణకు వచ్చింది. చంద్రయ్య హత్య జరగడానికి అరగంట ముందు ఓ ఎస్సై సివిల్ డ్రెస్‌లో గ్రామానికి వచ్చి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. హత్యకు అనుకూల వాతావరణం ఉందా.. లేదా అని రెక్కీ నిర్వహించి వెళ్లారు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఈ రెక్కీ నిర్వహించారని తెలుస్తోంది.

**నిందితులు సాక్షులుగా, సాక్షులు నిందితులుగా**

తోట చంద్రయ్య హత్య జరిగిన ఆర్నెల్లకే అంటే 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. అంతకు ముందే.. జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. జల్లయ్యను హతమారిస్తే గ్రామంలో తమ ఆధిపత్యానికి ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమార్చేందుకు సిద్ధమయ్యారు. జల్లయ్య రావులాపురం గ్రామంలో తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా.. మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వరపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా జల్లయ్యను హత మార్చారు. ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జల్లయ్య మేనమామలనే నిందితులుగా చేర్చి.. కేసు నమోదు చేశారు. జల్లయ్యను హత్య చేసిన వారినే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్ఠ. జల్లయ్యను హత్య విషయం పోలీసులకు ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యం.

**బాధితులనే నిందితులుగా..**

కొందరు టీడీపీ నాయకులు కారంపూడి వద్ద ఓ శుభకార్యానికి వెళ్తే.. రౌడీషీటర్ మన్నెయ్య, అతని అనుచరులు వారిపై హత్యాయత్నం చేశారు. ఆటోతో వారిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరి కాళ్లు విరగ్గా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో టీడీపీ వాళ్లు మన్నెయ్యను చంపడానికి యత్నిస్తే ఆయన దానిని ప్రతిఘటించారని బాధితులపైనే కేసు నమోదు చేశారు.

**మిస్టరీగా పిన్నెల్లి సోదరుడి భార్య, కూతురి మరణాలు**

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాబాయి సుందరరామిరెడ్డి తనయుడు మధుసూదనరెడ్డి భార్య, కూతురు మరణాలు ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయాయి. 2022లో మధుసూదనరెడ్డి భార్య లావణ్య (30), కుమార్తె సుదీక్ష (5) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అడిగొప్పుల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు కాల్వలోకి దూసుకుపోయిందని, ఈ ప్రమాదంలో తాను తప్పించుకోగా.. భార్య, కూతురు కాల్వలో మునిగి చనిపోయారనేది మధుసూదనరెడ్డి వాదన. పోస్టుమార్టం నివేదికలో వారు ఊపిరాడక చనిపోయారని, వారి ఒంటిమీద ఏడెనిమిది గాయాలు ఉన్నట్లు వెల్లడైంది. కానీ, కేసును ప్రమాదవశాత్తు జరిగిన మరణాలుగా పేర్కొంటూ మూసివేయడం మరిన్ని అనుమానాలకు ఆజ్యం పోసింది.

**నివేదిక తొక్కిపెట్టిందెవరు?**

ఈ మూడు కేసులపై కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాకపోవడంతో చివరకు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. సీఎం ఆదేశాలతో కేసులను పునఃవిచారణ జరిపించారు. ఈ మూడు కేసుల్లో పిన్నెల్లి సోదరుల ఒత్తిడి మేరకు నాటి పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించినట్లు విచారణ అధికారి ఎప్పుడో నివేదిక కూడా అందించారు. అయితే ఈ నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంటే ఆయా నివేదికలను ఉద్దేశపూర్వకంగా తొక్కిపట్టిందెవరు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**స్థానిక సంస్థల ఎన్నికల ఏకగ్రీవాల బాధ్యత ఖాకీలదే**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఖాకీలు తమ భుజస్కందాలపై వేసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ తరఫున నామినేషన్‌లు వేయకుండా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోలింగే జరగకుండా చేయాలని పిన్నెల్లి బ్రదర్స్ నుంచి వచ్చిన ఆదేశాలను ఆయా పోలీస్ అధికారులు పాటించారు. ఎవరైనా నామినేషన్ వేయడానికి ముందుకు వస్తే రాత్రికిరాత్రే వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కూర్చోపెట్టి బలవంతంగా మెడలో కండువా మార్చారు. అప్పటికీ మాట వినకుంటే అక్రమ మద్యం కేసులు బనాయించి జైలుకు పంపారు. ఓ ఎస్సై వేధింపులతో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మాచర్ల నియోజకవర్గంలో ఒక టిరెండు మినహా ఎక్కడ కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదు. రెంటచింతల పరిధిలోని పాలువాయి, తుమృకోటలో మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుమృకోటలో టీడీపీ అభ్యర్థి గెలిస్తే స్థానిక ఎస్సై దగ్గరుండి కౌంటింగ్ సమయంలో కరంట్ తీయించి ఫలితాన్ని తారుమారు చేసి వైసీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. జడ్పీటీసీకి పోటీ చేసేందుకు నామినేషన్ వేసేందుకు టీడీపీ నేతలు మాచర్ల మండలం జమ్మలమడక నుంచి వెళ్తుండగా.. పోలీసులు రెంటచింతలలో అడ్డుకుని వారిని మాచర్ల రూరల్ పోలీసులకు అప్పగిస్తే మాచర్ల రూరల్ పోలీసులు వారి మీద అక్రమ మద్యం కేసు పెట్టి అరెస్ట్ చేశారు.

**సమగ్ర విచారణ జరిగితే సగం మంది పోలీసులు ఇంటికే**

గత ఐదేళ్లలో పల్నాడులోని మాచర్ల టౌన్, మాచర్ల రూరల్, దుర్గి, రెంటచింతల, కారంపూడి, నాగార్జునసాగర్, వెల్దుర్తి తదితర పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించిన అనేక మంది ఎస్సైలు, సీఐల అక్రమాలపై విచారణ జరిపితే వారిలో అత్యధిక మంది సర్వీస్ నుంచి డిస్మిస్ అవుతారనే వాదన ఉంది. నాడు ఖద్దరుతో మిలాఖత్ అయిన పలువురు ఖాకీలు ఒక వైపు పిన్నెల్లి బ్రదర్స్ కనుసన్నల్లో పని చేస్తూ.. మరోవైపు కోట్లు దండుకున్నారు. ఆ విధంగా దోచుకున్న నోట్ల కట్టలను ఓ ఎస్సై తాను అద్దెకు ఉంటున్న ఇంటి సీలింగ్‌లో దాచారని, మరో ఎస్సై ఏకంగా అక్కడి టౌన్‌షిప్‌లో పెట్టుబడిపెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

**సాగర్ కాలువల మరమ్మతులకు మోక్షం**

**ఉమ్మడి జిల్లాకు రూ 8.70కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు**


**వారు ముందుకు రాకపోతే స్వల్పకాలిక టెండర్లు**

**ఐదేళ్లు కాలువలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం**

**నీటి సరఫరాలో తీవ్ర ఇక్కట్లు**

**ఎట్టకేలకు ఆ సమస్యకు పరిష్కారం**

# ఆయకట్టుకు జీవం



చిల్లచెట్లతో సాగర్ కాలువ...

ఒంగోలు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగు, తాగునీటి వనరు సాగర్ కాలువలే. కాగా 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ఒకవైపు ప్రపంచ బ్యాంకు నిధులు, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు ఇచ్చి భారీగా కాలువలు ఆధునికీకరణ చేపట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణను గాలికి వదిలేసింది. కనీస మరమ్మతులు కూడా పట్టించుకోలేదు. ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలు అన్న తేడా లేకుండా అన్నింటిలోనూ చిల్లచెట్లు, తూటుకాడ భారీగా పెరిగిపోవడంతోపాటు అనేక చోట్ల కట్టలు బలహీనపడటం, డ్రాపులు, షట్టర్లు ధ్వంసమై నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అవస్థలను గుర్తించి అత్యవసర పనులను చేపట్టారు. వ్యవసాయ సీజన్, కాలువల్లో నీటి సరఫరాతో అన్ని పనులు చేపట్టేందుకు వీలు కాలేదు. దీంతో వచ్చే సీజన్‌కు సాగర్ కాలువల్లో నీరు వచ్చేలోపు అలాంటి పనులు చేపట్టి పూర్తిచేయాలని అందుకోసం అత్యవసరంగా చేయాల్సిన పనులను నివేదించాలని ఏప్రిల్‌లో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు జిల్లాల అధికారులను ఆదేశించారు.

**చీమకుర్తి డివిజన్‌కు ఎక్కువ**

తదనుగుణంగా జిల్లా స్థాయి అధికారులు ప్రతిపాదనలను తయారు చేసి పంపారు. వాటిని పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.374 కోట్ల విలువైన పనులను ఉన్నతాధికారులు మంజూరు చేశారు. అందులో ఒంగోలు కేంద్రంగా ఉన్న ఎన్ఎస్‌పీ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో సాగర్ కాలువల్లో అత్యవసర పనులకు రూ.8.70 కోట్లు మంజూరయ్యాయి. గతంలో ఈ తరహా పనులు స్వల్పంగా మాత్రమే జరిగిన చీమకుర్తి డివిజన్‌లోని సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి నియోజకవర్గాల్లో కాలువల మరమ్మతులకు రూ.5.12 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87 పనులు చేపట్టనున్నారు. అలాగే దర్శి డివిజన్‌లో పరిధిలో 37 పనులకు రూ.1.08 కోట్లు మంజూరు కాగా ఆ డివిజన్ పరిధిలో గత ఏడాది దాదాపు రూ.3.50 కోట్లతో పనులు మంజూరు చేసి ఉండటంతో ఈ సారి కొంత తగ్గించారు.

**తక్షణం పనులు చేపట్టాలి**

ఇక ఒంగోలు సర్కిల్ పరిధిలో బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి డివిజన్‌లోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో 78 పనులకు రూ.2.58 కోట్లు మంజూరు చేశారు. తక్షణం ఈ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజా ప్రభుత్వం వచ్చాక సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిన నేపథ్యంలో ప్రస్తుతం మంజూరుచేసిన పనులను వాటి ద్వారా చేపించాలని అధికారులను ఆదేశించింది. గతంలో రూ.5లక్షల పనుల వరకే నామినేషన్ పద్ధతిపై చేసే అవకాశం ఉండగా, దానిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచారు. ప్రతిపాదించిన అన్నీ రూ.10లక్షలలోపే ఉండటంతో సాగునీటి సంఘాల నుంచి తీర్మానాలను తీసుకొని వారికి అధికారులు పనులు ఇచ్చే అవకాశం ఏర్పడింది. కాలువల్లో నీరు వచ్చేలోపుగా పూర్తి చేయాలన్నది ప్రభుత్వం నిర్ణయం.

- ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలు అనేకచోట్ల కోసుకుపోయాయి. కొన్నిచోట్ల లైనింగ్ కూడా దెబ్బతింది. కాలువలకు నిండుగా నీరు విడుదల చేస్తే తెగిపోయే పరిస్థితి ఉంది. కట్టలపై చిల్లచెట్లు దట్టంగా పెరిగి రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. మేజర్లు, మైనర్లు కూడా రూపురేఖలు మారిపోయాయి. తూర్పు వీరాయపాలెం మేజర్‌లో చిల్లచెట్లు దట్టంగా మొలిచాయి అనేకచోట్ల కట్ట కోసుకుపోయింది.
- దర్శి బ్రాంచ్ కాలువ, ఒంగోలు బ్రాంచ్ కాలువల పరిధిలోని మేజర్లు, మైనర్లు గత ఐదేళ్లల్లో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం బ్రాంచ్ కాలువల మరమ్మతులకు, మేజర్లు, మైనర్లు మరమ్మతులకు నిధులు మంజూరుచేయటంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఏడాది సాగర్ జలాలు విడుదల చేసేలోపు మరమ్మతులు పూర్తిచేసే వీలుగా నిధులు విడుదల కావటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- సాగర్ జలాలు పారేందుకు ఎట్టకేలకు ఆటంకాలు తొలగనున్నాయి. కాలువల బాగుకు రంగం సిద్ధమైంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వకాలంలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక చిల్లచెట్లు, తూటుకాడతో నిండిపోయిన సాగర్ కాలువలపై ప్రభుత్వం దృష్టిసారించింది. కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చేసి ఎగువ నుంచి వచ్చే నీరు పొలాలకు చేరేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం అత్యవసర పనుల పేరుతో తాజాగా ఉమ్మడి జిల్లా పరిధిలోని కాలువల మరమ్మతుల కోసం రూ.8.70 కోట్లు మంజూరు చేసింది. రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన మొత్తం 232 పనులు చేపట్టనున్నారు.



## డీసీఎంఎస్ చైర్మన్‌గా కాశిరెడ్డి బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కాశిరెడ్డి

ఒంగోలు విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా సంస్థను అభివృద్ధి పథంలో పయనింపజేస్తానని శ్యామల కాశిరెడ్డి తెలిపారు. డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ చైర్మన్‌గా ఆయన సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికార పీఐసీగా కొనసాగుతుండగా ప్రస్తుతం కాశిరెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్మన్‌గా తన నియామకానికి ముఖ్యకారకులైన కనిగిరి, ఒంగోలు ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత కార్యాలయంలోని తన చాంబర్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, చైర్మన్ కాశిరెడ్డిని తీసుకెళ్లి ఆయన సీటులో కూర్చోబెట్టారు. తర్వాత ఆయనతో జిల్లా సహకారాధికారి(డీసీవో) ఎస్.ఇందిరాదేవి సంతకం చేయించారు. కనిగిరి నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు బొకేలు, శాలువలతో కాశిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బిజినెస్ మేనేజర్ రామచంద్రనాథ్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బదిలీల కౌన్సెలింగ్

**పంచాయతీ కార్యదర్శుల, ఉద్యోగులు హాజరు**

**త్వరలో వారందరికీ పోస్టింగ్‌లు**



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో వెంకటనాయుడు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో సోమవారం డీపీవో గొట్టిపాటి వెంకట నాయుడు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఐదేళ్ల పైబడి ఒకేచోట పనిచేసిన ఉద్యోగులతోపాటు రెండేళ్ల పాటు పనిచేసిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టారు. డిప్యూటీ మండల పరిషత్ అధికారుల బదిలీల కోసం ఏడుగురు దరఖాస్తులు చేసుకోగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది 19 మంది బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారికి ఆయా పంచాయతీల్లో ఖాళీల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు 72 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 11, గ్రేడ్-2 కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 కార్యదర్శులు 29 మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 30 మంది బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారందరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 9వతేదీలోపు ప్రభుత్వం బదిలీలకు గడువు పెంచడంతో ప్రస్తుతం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో బదిలీలైన ఉద్యోగులకు త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

## బీటీ.. రాష్ట్రాలు దాటి..!

(మొదటి పేజీ తరువాయి)

అరకేజీ రూ.300 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అధిక మొత్తంలో బీటీ-3 విత్తనాలు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు ఎక్కువ మొత్తంలో వెళ్లిపోయాయి. అదే సమయంలో తెలంగాణకు కూడా ఎక్కువ మొత్తంలో నిల్వలు తరలించారు. అక్కడ కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసిన బీటీ-3 విత్తనాల ప్యాకెట్లు అక్కడ అధిక ధరకు విక్రయస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు.

**తూతూ మంత్రమే..**

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్న నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలతో ఆటో నగర్‌లోని కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల సమాచారం ముందే తెలియడంతో ఎక్కడా ఏమీ లభ్యం కాలేదని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఒక చోట కొన్ని విత్తనాలు దొరికినా.. కొందరు అధికారులు వాటిని సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంలో 34 పార్సిల్ కార్యాలయాలు ఉన్నప్పటికీ వాటిని తనిఖీ చేసే నాథుడు లేకపోవడం గమనార్హం.

**ఒక్క కేసూ లేదు**

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో ముగ్గురు ఏఓలను ప్రత్యేకంగా నియమించారు. గుంటూరు నగర పరిధిలో నిఘా వేసి నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పట్టుకోవడం వీరి పని. గడచిన ఏడాది కాలంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో పనిచేసే ఏఓ లు పెద్దగా దాడులు చేసిన సందర్భాలు లేవు. గతంలో ఏడాదికి తక్కువలో తక్కువ 15 కేసులు నమోదు అయ్యేవి. గడచిన ఏడాదిలో ఒకటీ రెండు కేసులు తప్ప ఎక్కువ నమోదు కాలేదు. అంటే నకిలీలను అరికట్టే విషయంలో వ్యవసాయ శాఖ ఏ మేరకు కఠినంగా వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు.

**అధికారులకు స్నేహితులే వ్యాపారులు..**

నగర పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తయారు చేసే వారంతా వ్యవసాయ శాఖలోని ఏదో ఒక స్థాయి అధికారుల స్నేహితులు.. సహ విద్యార్థులే అని తెలుస్తోంది. ఆ అనుబంధం రైతులను నట్టేట ముంచేందుకు బాగానే ఉపయోగ పడుతోంది. ప్రస్తుతం ఉన్న అధికారుల మీద ఇటువంటి ఆరోపణలు ఎక్కువగా ఉన్నా కమిషనరేట్‌లోని గాడ్ ఫాదర్ లు ఆశీస్సులు మెండుగా ఉన్నందువల్ల ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

**నగర పోస్టు.. భలే కాస్టు**

గుంటూరు నగర పరిధిలోని ఏఓ పోస్టుకు బాగా గిరాకీ ఉంది. నగర పరిధిలోనే లెక్కకు మించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇక్కడ తనిఖీకి వెళ్లకుండా ఉంటే ఏడాది రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. అందుకని ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు మొదటి నుంచి భారీ లాబీయింగ్ నడుస్తోంది. రాజకీయ నేతలు, అధికారుల ఆశీస్సులు ఉన్న వారికే ఈ పోస్టుల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. కమిషనరేట్‌లోని కొందరు కీలక అధికారుల సిఫార్సుతో వైసీపీ నేపథ్యం ఉన్న వారిని ప్రస్తుతం ఆ పోస్టుల్లో నియమించడం వివాదాస్పద మయ్యింది.

## అవీ..ఇవీ..

### గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పందిళ్లపల్లి(చీరాల), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామం నాగవరపమ్మ ఆలయం సమీపంలో చెట్ల మధ్య గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతదేహం గుర్తించలేని విధంగా ఉంది. వయసు సుమారు 55-60 మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

### గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, జూన్2 (ఆంధ్రజ్యోతి) : వివాహితను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని మార్టూరులోని సంపత్‌నగర్‌కు చెందిన గుంజి వాసంతి అనే వివాహిత భర్త అత్తలపై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్‌ఐ సైదా తెలిపారు. ఆయన కథనం ప్రకారం వాసంతికి ఇడుపులపాడు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో 2021 లో వివాహమైంది. అయితే కొంతకాలం నుంచి వాసంతిని వేధిస్తుండగా గృహహింసపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



చిత్రపటంతో పాటు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన కార్యకర్త గరికిన కొత్తబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండడంతో సోమవారం మంగళగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన ఎమ్మెల్సీ నాగబాబు చేతుల మీదుగా రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని మృతుని చిత్రపటాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు షేక్ రియాజ్, అలా అనీల్ తదితరులు ఉన్నారు.

### కోటపాడులో నేత్ర దానం



వెంకాయమ్మ (ఫైల్)

పంగులూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో నేత్ర దానం జరిగింది. గ్రామానికి చెందిన పేర్ని వెంకాయమ్మ(91) ఆదివారం రాత్రి మృతి చెందారు. వెంకాయమ్మ కోడలు పేర్ని పార్వతి, మనుమరాలు గాయత్రిలు ఆమె నేత్రాలు దానం చేసేందుకు రోటరీక్లబ్ ప్రతినిధులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న కాకాణి శంకర్ కంటి వైద్యశాల సిబ్బంది కోటపాడు చేరుకుని వెంకాయమ్మ కంటి కార్నియాలను సేకరించారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ తాటి సుబ్బారావు, పేర్ని స్వరాజ్యలక్ష్మిల ప్రోత్సాహంతో నేత్రదానం చేశారు.

### శిథిలమైన బావితో పొంచి ఉన్న ప్రమాదం



రహదారి మధ్యలో ఉన్న బావి

పాపాయపాలెం (చీరాల), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయపాలెం గ్రామంలో ప్రమాదం పొంచి ఉంది. గ్రామ ప్రధాన రహదారి వెంబడి శిథిలమైన బోరు బావి ప్రమాద భరితంగా ఉంది. అది సుమారు 15 అడుగుల లోతులో మురుగు నీరు చేరి, బావిముందు అంచులు శిథిలమయ్యాయి. అంతేకాకుండా అతి తక్కువ ఎత్తులో ప్రమాద భరితంగా ఉంది. ఆ రహదారిలో విద్యుత్ దీపాల సౌకర్యం కూడా అంతంత మాత్రమే. పల్లెటూరు కావడంతో రాత్రి సమయంలో చిన్నారులు ఆటలాడుతుంటారు. ఈక్రమంలో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వాహన దారులు సైతం ఆ పరిసరాల్లో తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తలు చేట్టాలని లేకుంటే సమస్యలు చవి చూడాల్సి వస్తుందని చెబుతున్నారు.

# శిథిలావస్థలో పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్

- పెచ్చులూడి గాయపడుతున్న ప్రయాణికులు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- మురుగునీటి నిల్వలతో దుర్గంధభరితంగా ప్రాంగణం



పెచ్చులూడిన శ్లాబు కింద కూర్చున్న ప్రయాణికులు

పర్చూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల మంది ప్రయాణికులతో రాకపోకలు సాగించే పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా తయారైంది. భవనం శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపడి ప్రయాణికులు గాయాలు పాలవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు వివిధ మండలాలకు ప్రధాన కూడలిగా ఉంది. దీంతో చీరాల, చిలకలూరిపేట, నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, ఇంకొల్లు తదితర మార్గాలకు వెళ్లే బస్సులు పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ నుండే రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులతో ఆర్‌టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న బస్టాండ్ శిథిలావస్థకు చేరుకొని ప్రమాదభరితంగా ఉన్నా అధికారులు కన్నెత్తి చూడకపోవటంపై ప్రయాణికులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అడవిని తలపిస్తున్న ప్రాంగణం**

ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణం చుట్టూ చిల్లచెట్లు, ముళ్లపొదలు పెరిగి అడవిని తలపిస్తోంది. దీనికి తోడు మందుబాబుల వీరంగం కూడా పెరగడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంటుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. ఇక బస్టాండ్‌కు విద్యుత్ సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంది. దీంతో రాత్రిసమయాల్లో ప్రయాణికులు అర్టీసీ బస్టాండ్‌కు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

**నిరుపయోగంగా మరుగుదొడ్లు**

మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి చిల్లచెట్లతో పేరుకుపోయి ఉన్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

**పెచ్చులూడి పడి ప్రమాదాలు**

పర్చూరులో అర్‌టీసీ బస్టాండ్ నిర్మించి మూడు దశాబ్దాలు కావడంతో భవనం పూర్తిగా దెబ్బతింది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో భవనంపై స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి శిధిలావస్థకు చేరిన అర్‌టీసీ బస్టాండ్‌కు కనీస మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ఇనపచువ్వలు బయటపడ్డ శ్లాబు, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, చిల్లచెట్లతో నిండిన ప్రాంగణం

# మహనీయుని ఆశయసాధనకు కృషి

**ఘనంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి**




గోపాలకృష్ణయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల - పేరాల ఉద్యమ కారులు, మహనీయులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గోపాలకృష్ణయ్య ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, సర్విశెట్టి సుబ్బరామయ్య, అర్వపల్లి కుమార్, వేణుగోపాల్, కోట వెంకటేశ్వరరెడ్డి, సురేష్, శివప్రసాదరావు, రమేష్, గజవల్లి శ్రీనివాసరావు, నాగవీరభద్రా చారి, బీరం సుందరరావు, రాధాకృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

ఆంధ్రరత్న, ప్రముఖకవి, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలు వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చీరాల ప్రాంతంతో దుగ్గిరాలకు ఉన్న సంబంధాలను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, ప్రసాద్, వీరాంజనేయులు, సుబ్బారావు, పూర్ణ, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

### పచ్చిరొట్ట విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో కుమారి

బల్లికురవ. జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందే పడడం వలన ఖరీఫ్‌లో పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని ఏవో కుమారి సూచించారు. సోమవారం మండలంలోని మల్లాయపాలెం, వేమవరం, కొప్పెరపాలెం గ్రామాలలో రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటలు సాగు చేసే రైతులు భసార పరిక్షలు చేయించుకొని వాటి నివేదికల ఆధారంగా పంటలు సాగుచేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నామన్నారు. సమావేశంలో వీఆర్వో రవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న పంటను సాగుచేసుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు), జూన్2(ఆంధ్రజ్యోతి): రైతులు మొక్కజొన్న పంటను సాగుచేసుకోవాలని, సాగర్ జలాలు వచ్చిన తర్వాత వెంటనే నారుమళ్ల వేసుకోవాలని వ్యవసాయశాఖ పర్చూరు ఏడీఏ ఎన్ మోహనరావు రైతులకు సూచించారు. సోమవారం యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో ఖరీఫ్ సాగు నిమిత్తం రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో ముందస్తుగా సాగర్ జలాలును విడుదల చేస్తున్నారన్నారు. రైతులు జాగ్రత్తగా పంటలసాగును చేపట్టాలన్నారు. అనంతరం ఏవో మేరమ్మ మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ హరీష్, రైతులు బోయపాటి సాంబశివరావు, బత్తుల సాంబయ్య, ఈదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కనకనాగవరపమ్మ శిడిమహోత్సవాలు ప్రారంభం



సంతరావూరు గ్రామంలో అమ్మవారి ఊరేగింపు

చినగంజాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామంలో కనకనాగవరపమ్మ అమ్మవారి శిడిమహోత్సవ పూజలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సంతరావూరు గ్రామంలోని మీసాల బాబురావు ఇంటి వద్ద ఉన్న అమ్మవారి గిలకల మందిరం వద్ద నుంచి కనకనాగవరపమ్మ అమ్మవారిని మేళతాళాలు, కనకతెప్పట్లులతో ఊరేగింపుగా అమ్మవారినిధి వద్దకు చేర్చారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిడిమహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. 3వ తేది రాత్రి సంతరావూరు గ్రామంలోని నాయిని శేషగిరి ఇంటి నుంచి అమ్మవారు సముద్రస్నానానికి బయలుదేరడం, 4వ తేది రాత్రి గ్రామంలో కనక నాగవరపమ్మ కళానాట్యమండలి వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, 5, 6 తేదీలలో గ్రామంలో గ్రామస్థులు, ఒంగోలుకు చెందిన దివంగత కొత్తగర్ల వెంకటేశ్వర్లు సోదరులు, కుమారుల ఆర్థిక సహకారంతో కొలుపులు (వేడుకలు) నిర్వహించనున్నారు, 7న గ్రామంలో అమ్మవారి పొంగళ్లు జరుపుకొని వడ్డిపాలెం పోలేరమ్మ మందిరం వద్ద నుంచి సాయంత్రం గ్రామం నుంచి శిడిబండి బయలుదేరి రావూరుపేటలోని అమ్మవారి గుడి వద్దకు చేర్చుట, 8, 9 తేదీలలో పరిసర గ్రామాల్లో అమ్మవారి జోగి కార్యక్రమాలు, 10వ తేది అమ్మవారి శిడిమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

### పాండురంగస్వామి ఆలయానికి విరాళం



దేవస్థాన కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న భక్తులు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విఠల్‌నగర్‌లో వేంచేసిన రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయానికి సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త, స్వామి భక్తులు హైదారాబాదుకు చెందిన కుంచాల ఏడుకొండలు రూ.1,01,100 నగదును విరాళంగా అందజేశారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిదులు విశ్రాంత ఎంపీడీవో శ్రీరామచంద్రమూర్తి, ఉడతా శంకరరావు, తన్నీరు రామారావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### గోశాలకు ఆవుల తరలింపు

- నెరవేరిన దుద్దుకూరు గ్రామస్థుల కోరిక



గోశాలకు వెళుతున్న ఆవులు

ఇంకొల్లు, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుద్దుకూరులో గోవధకు తరలిస్తున్న గోవులను గ్రామస్థులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. గ్రామస్థుల ఐక్యతతో అధికారుల సమక్షంలో వీటిని సోమవారం ఉదయం నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలో నందగోవుల ట్రస్టుకు తరలించారు. నాలుగు రోజులుగా వీటిని గ్రామంలోనే ఉంచి గోశాలకు తరలించాలని గ్రామస్థులు పట్టుబట్టారు. సోమవారం ఉదయం పశువైద్యులు గోవులకు పరీక్షలు నిర్వహించి అనంతరం పోలీసులు, గ్రామస్థుల సమక్షంలో వాహనాన్ని ఏర్పాటు చేసి 9 ఆవులను క్షేమంగా తరలించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. గోవుల ప్రాణాలు కాపాడిన దుద్దుకూరు గ్రామస్థులను ఆర్‌ఎస్‌ఎస్ కార్యాకర్తలు, అధికారులు అభినందించారు.

### నివేశన స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి




నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

చీరాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రాష్ట్రప్రభుత్వం అందించే నివేశన స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జెల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుండి పట్టణంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్నారు. నిరాశ్రయులకు ప్రతి ఒక్కరికి పట్టణంలో వారికి రెండు సెంట్లు, గ్రామీణ వాసులకు మూడు సెంట్లు అందించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెల్లి విల్సన్, జిల్లా సభ్యులు బత్తుల శామ్యూల్, మేడా వెంకటరావు, వాడరేవు, అయోధ్యనగర్, జాండ్రపేట, ఈపూరుపాలెం, రామకృష్ణాపురం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### ఖబరస్తాన్‌కు నిధుల మంజూరుపై హర్షం

నాగులపాలెం(పర్చూరు) , జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబరస్తాన్) అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గ్రామంలోని మసీదు వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో షేక్.కరిముల్లా, షేక్.షయాజ్, షేక్.షకూర్, మౌలాలీ, మాబూబాషా, బాజిసైదా, ఖాదర్‌బాషా,ఖాజా, అబ్దుదల్ వహీద్, బాజీవలి, సుభానీ రన్‌హుస్సేన్ పాల్గొన్నారు.

### ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు స్థల పరిశీలన

- మూడు వేల ఎకరాలకు అందనున్న సాగునీరు



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో నూతనంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు సోమవారం ఇరిగేషన్ అధికారులు స్థల పరిశీలన చేశారు. గొనసపూడి వంతెన సమీపంలో కొమ్మమూరు కాల్వపై ఎత్తిపోతలు నిర్మించి భీమవరం సమీపంలోని దుద్దుకూరు 3వ మైనరులో నీటిని ఎత్తిపోసేందుకు విశ్రాంత ఇరిగేషన్ అధికారి సత్యనారాయణ స్థలాన్ని పరిశీలించారు. భీమవరం, గొనసపూడి, ముప్పాళ్ల రైతులతో సమావేశమై చర్చించారు. ఈ ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు నిధులు కూడా మంజూరైనట్లు సత్యనారాయణ తెలిపారు. ఇక్కడ నిర్మించే ఎత్తిపోతల పథకంతో సుమారు మూడు గ్రామాల పరిధిలోని మూడు వేల ఎకరాలకు సాగు నీరందించవచ్చున్నారు. ఆయన వెంట ఈఈ భాగ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాటిబండ్ల శ్రీరామూర్తి, చలిచం సాంబయ్య, రాఘవయ్య, కోట కృష్ణమూర్తి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### యోగాతో ఆరోగ్యకరమైన జీవితం


- డాక్టర్ దాసరి చంద్రశేఖర్



యోగాపై శిక్షణ నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని యోగా శిక్షణకులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా వారం రోజుల నుంచి పర్చూరు మండలంలో నిర్వహిసున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కళ్యాణ మండప ప్రాంగణంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రద్యుమ్నాకుమార్, ఎంఈవో వెంకట్రామయ్య ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పనిఒత్తిడి ఇతర సమస్యలు, ఆహారపు అలవాట్లతో ప్రజలు అధికశాతం వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

### భవనాశి తటాకంలో తూటాకు తంట




చెరువులో పేరుకుపోయిన తూటాకు, నాచు

అద్దంకి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భవనాశి చెరువులో దట్టంగా పెరిగిన నాచు, తామర ఆకులు పచ్చతివాచి పరిచినట్లు ప్రత్యేకంగా కనిపిస్తున్నా, జాలర్లకు మాత్రం శాపంగా పరిణమిస్తోంది. ఈ తూట ఆకులు చేపల ఎదుగుదలకు అడ్డంకిగా మారాయి. దీనికి తోడు చేపల వేట కు కూడా ఇబ్బంది గా మారిందని జాలర్లు వాపోతున్నారు. తాటాకు ఉన్న ప్రాంతంలో వల వేయడం కుదరదని వాపోతున్నారు.


### పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాలుష్య నియంత్రణమండలి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నియంత్రించి, గుడ్డ సంచులను వాడాలని తెలిపారు. ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఒంగోలు రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులకు ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా కళాజాతర, రైల్వే శాఖ సహకారంతో ర్యాలీ, స్టేషన్ ఆవరణంలోని పార్కునందు జీవన వైవిధ్యానికి సంబంధించిన మొక్కలను నాటి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ నంద కిషోర్, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శరణం చంద్రారెడ్డి, ప్రయాణికులు పాల్గొన్నారు.



బియ్యం ఆపేశారయ్యా..

# నా ఆకలి తీర్చేదెవరు!?




ఈయన పేరు షేక్ మౌలాలి. బుజ బుజనెల్లూరు వాసి. 62 ఏళ్ల వృద్ధుడు. పుట్టుకతోనే రెండు చేతులు లేవు. కాళ్లు చచ్చుబడ్డాయి. భార్య షంషాద్ వేలిముద్రవేసి 35 కేజీల బియ్యం తీసుకునేది. అయితే, అనుకోని పరిస్థితుల్లో గతేడాది షంషాద్ మృతి చెందింది. అప్పటినుంచి వేలి ముద్ర వేసే దిక్కు లేకపోవడంతో బియ్యం పంపిణీని అధికారులు ఆపేశారు. వేలి ముద్ర వేస్తేనే బియ్యం ఇస్తామనే హుకుం జారీ చేశారు. తన మొరను ఉన్నతాధికారులకు చెప్పుకుందామని రెండు సార్లు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చాడు. అయినా స్పందించలేదు. చివరకు మూడోసారి కూడా కలెక్టరేట్‌కు చేరుకుని తన దీనావస్థను కనబడ్డ అధికారులకు చెప్పుకుని కన్నీటిపర్యంతమయ్యాడు.

- ఇలాంటి ఎందరో అభాగ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు మొరపెట్టుకున్నారు.

8

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు ఉత్తమ ర్యాంకులు

నెల్లూరు (విద్య), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గత నెల 18వ తేదీన జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 2వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. సోమవారం విడుదలైన ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. జాతీయస్థాయిలో మధుకిరణ్ 133, పూర్వజ్ 332, సంతోష్ 1361, భానుకిరణ్ 1563, అఖిలేష్ 2323, యశ్వంత్‌బాబి 2481, సాయికేత్విక్ 2517 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ ఐఐటీల్లో సీట్లు సాధించి సాఫ్ట్‌వేర్లుగా రాణిస్తామని తెలిపారు.



## బొ'ప్పాయె'!

**గత నెల కిలో రూ.16.. ఇప్పుడు రూ.ఆరే**

బొప్పాయి సాగుదారులను ధర కలవరపెడుతోంది. గత నెలలో కిలో రూ.16 పలికిన కాయ ఇప్పుడు ఆరు రూపాయలకు పడిపోయింది. అనంతసాగరం మండలంలోని సంజీవనగరం, గౌరవరం, చిలకలమర్రి, చాపురాళ్లపల్లి, యాకర్లపాడు, బొమ్మవరం, అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉంది. ఒక ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షలు ఖర్చు అవుతుంది. అందుకు తగ్గట్టు 30 నుంచి 40 టన్నుల దిగుబడి రావాలి. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. ఇక్కడ నుంచి కోల్‌కతా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు బొప్పాయిని ఎగుమతి చేస్తారు. చిప్స్, రసాయనాలు, కిళ్లీ సామగ్రి తయారు చేస్తారు. బొప్పాయి కాయలతో వచ్చిన పాలను మెడిసిన్ తయారీకి వినియోగిస్తారు. ప్రస్తుతం డిమాండ్ ఆశాజనకంగా ఉన్నా వ్యాపారులు, దళారులు ఏకమై ధరను పతనావస్థకు చేర్చారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత నెలలో కిలో రూ.16 పలకగా ఇప్పుడు 6లకు మించడం లేదు. ఇటు దిగుబడి లేక.. అటు ధర లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

## 12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10గంటల నుంచి ప్రణాళిక, ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై సాయంత్రం వరకు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు అధికారులు, సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

## 6 నుంచి డీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (విద్య) : డీఎస్సీ పరీక్షలను ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో పొందాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే సమయంలో హాల్‌టికెట్‌తో రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. హాల్‌టికెట్‌లో పుట్టిన తేదీ, నివాసం, పేర్లు తదితర పొరపాట్లు ఉంటే పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ వద్దనున్న నామినల్ రోల్స్‌లో సరిచేసుకోవాలని కోరారు.

## జంతువులను హింసిస్తే కఠిన చర్యలు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జంతువులను వధించినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రమేష్ నాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగల సందర్భంగా జంతువులను హింసిస్తే జంతు హింస నివారణ యాక్టు 1960 ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. రాష్ట్ర పశుసంవర్థక శాఖ ఆదేశాల మేరకు జిల్లా నోడల్ అధికారిగా సహాయ సంచాలకురాలు డి.మాధవీలతను నియమించినట్లు తెలిపారు. జంతు సంరక్షణ చట్టాలు తప్పక పాటించాలని అతిక్రమిస్తే పోలీసులు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎక్సైజ్ డీసీగా శంకరయ్య

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం శంకరయ్యను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డీసీగా ఉన్న శ్రీనివాసరావు గత నెలలో పదవీవిరమణ పొందారు. కాగా, శంకరయ్య విజయనగరం ఏసీగా, సెబ్‌లో విజయవాడ డీసీగా విధులు నిర్వహించి ప్రస్తుతం హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నారు.

## 6న ఐటీఐలో కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య) : జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 6వ తేదీన నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా హేనా సుజన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా స్త్రీ శిశుసంక్షేమాధికారిగా హేనాసుజన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సువర్ణ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. స్త్రీ శిశుసంక్షేమాధికారిగా గతంలో పని చేసిన హేనాసుజన్ రెండోసారి జిల్లాకు వచ్చారు.

# విద్యుత్ షాక్‌తో ఇద్దరు డ్రైవర్ల మృతి

**మృతులది తమిళనాడులోని విల్లుపురం**

విడవలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తి గ్రామంలోని రొయ్యల గుంతల వద్ద ఆదివారం రాత్రి విద్యుదాఘాతానికి గురై తమిళనాడుకు చెందిన ఇద్దరు కంటైనర్ డ్రైవర్లు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ముదివర్తి పంచాయతీ పరిధిలో రొయ్యలను సాగు చేస్తున్న రాధయ్య పుదిచ్చేరిలోని స్టార్ హేచరీ నుంచి రొయ్య పిల్లలను కొనుగోలు చేశారు. దీంతో ఆ హేచరీ నిర్వాహకులు రెండు కంటైనర్లలో రొయ్య పిల్లలను ముదివర్తి గ్రామానికి పంపారు. ఆదివారం రాత్రి గుంతల వద్దకు వచ్చిన కంటైనర్లు రొయ్యల పిల్లలను అన్‌లోడ్ చేయడానికి డ్రైవర్ లోక్‌నాథ్ (45) లారీని గుంత కట్టమీదకి ఎక్కించాడు. దీంతో గుంతలపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు లారీకి తగలటంతో విద్యుత్ లారీ మొత్తం ప్రసరించింది. దీంతో డ్రైవర్ లోక్‌నాథ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈయన్ను కపాడే ప్రయత్నంలో మరో కంటైనర్ డ్రైవర్ మణి (25) కూడా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులిద్దరిదీ తమిళనాడులోని వీల్లుపురానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ తెలిపారు.



రొయ్యల గుంతల గట్టుపై కంటైనర్ పక్కన పడి వున్న లోక్‌నాథ్, మణి మృతదేహాలు

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 122 |
| స్కిన్ చికెన్ | 220 |
| స్కిన్‌లెస్ | 244 |

కోడిగుడ్ల ధర (100): 525

## నలదలపూరులో 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

వలేటివారిపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నలదలపూరు గ్రామ సచివాలయంలో సోమవారం వ్యవసాయశాఖాధికారులు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏవో హేమంత్‌భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద విత్తనాలు ఎకరాకు 10 నుంచి 15 కిలోలు చల్లుకొని, పూత దశలో ఉన్నప్పుడు దుక్కిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుందని తెలిపారు. మండలానికి 160 క్వింటాళ్ల జనుము, 150 క్వింటాళ్ల పిల్లిపెసర పచ్చిరొట్ట విత్తనాలు ప్రభుత్వం నుంచి మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్, కోళ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కన్నన్, రైతులు పాల్గొన్నారు.

## చెత్తతో సంపద తయారీ ద్వారా ఆదాయం పెంపే లక్ష్యం

● కే. పెంచలవీరేంద్ర, ఈవోపీఆర్డీ, అల్లూరు



అల్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పంచాయతీలో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపడుతున్నాం. తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈవోపీఆర్డీ కె.పెంచల వీరేంద్ర తెలిపారు.

**? మండలంలో ఎన్ని సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. వాటి నిర్వహణ, సంపద సృష్టి ఎలా ఉంది.**

! మండలంలోని పది పంచాయతీల పరిధిలో 8 సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. అన్నింటిని సిద్ధం చేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం.

**? వర్మీకంపోస్టు ఎరువులు ఎలా విక్రయిస్తారు. ధర ఎంత.**

! వర్మీ కంపోస్టు ఎరువులు అవసరమైన రైతులకు విక్రయిస్తాం. దీనికి కిలో రూ.10 ధర నిర్ణయించామని, అయితే స్థానిక రైతులకు కిలో రూ.2కే విక్రయిస్తామన్నారు.

**? గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపడుతున్నారా.**

! అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయి. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాం. మురుగు నీరు నిల్వ లేకుండా చూస్తున్నాం.

**? పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత లేదా, వారికి జీతాలు సక్రమంగా చెల్లిస్తున్నారు.**

! పారిశుధ్య సిబ్బంది కొరత లేదు. వీరికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం రూ.6 వేల ఇస్తున్న జీతం సంపద తయారీ ద్వారా వచ్చే ఆదాయంతో రూ.9 వేలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

**? ప్లాస్టిక్ వినియోగం నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.**

! 40 మైక్రాన్లకంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్న నిబంధనలు ఉన్నాయి. దాదాపు అన్ని చోట్ల 40 మైక్రాన్లకు మించి ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. అంతకంటే తక్కువ మందం కలిగిన కవర్లను వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

# ఇప్పుడే ఇలా.. వర్షాలు వస్తే ఎలా?

● పూడికతీతకు నోచుకోక దుస్థితిలో పంట కాలువలు ● కావలి పట్టణానికి పొంచిఉన్న ముప్పు ● ఆందోళనలో ప్రజలు, రైతులు



టీవీ స్టేషన్ వద్ద కంపచెట్లు, గడ్డితో నిండిపోయిన తాళ్లపాలెం చెరువు వరవ కాలువ

కావలి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం, మండలంలో సాగు నీటి కాలువలు పూడికతీతకు నోచుకోక దుస్థితిలో ఉన్నాయి. వాటి రూపురేఖలు మారిపోయి ఉన్న ఈ కాలువలు ఇప్పుడే ఇలా .. వర్షాలు వస్తే ఎలా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోతే రానున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పట్టణ వాసులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నుంచి సాగు నీటిని సరఫరా చేసే కాలువలు పూడిక, గడ్డితో నిండిపోయి మురుగు నీటి కాలువలుగా మారిపోయాయి. పట్టణం లోని పాతూరు నుంచి వెంగయ్యగారిపాలెంలోని కావలమ్మ గుంటకు నీటిని సరఫరా చేసే సాగు నీటి కాలువలు మురుగు నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రానున్న వర్షాలకు ఈ కాలువ గుండా నీటి సరఫరా సాగేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కావలి చెరువు నుంచి పాతూరు గుండా తాళ్లపాలెం జూటూరు చెరువుకు సాగునీటి సరఫరా జరిగే వరవ కాలువకు ఇటీవల పూడికతీత చేపట్టినప్పటికీ పాతూరులోని వెంగయ్యగారిపాలెం రోడ్డులో కాలువ మొత్తం గడ్డి, పూడికతో నిండిపోయింది. వర్షాలకు పట్టణంలోని వర్షపు నీరు మొత్తం ఈ కాలువల గుండానే చెరువులకు చేరాల్సి ఉండగా పూడిపోయిన కాలువలతో పట్టణ వాసులకు వర్షపు నీటి తో ముప్పుతప్పదు. అధికారులు పాలకులు స్పందించి రానున్న వర్షాలకు ముందస్తుగా పట్టణం లోని వరవ కాలువలు, సాగు నీటి సరఫరా కాలువలకు పూడికతీత పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



వెంగయ్యగారిపాలెంలో గడ్డితో నిండిన ప్రధాన పంట కాలువ

## కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అల్లూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : అల్లూరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం హోమం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. రాత్రి ఆదిదంపతులకు ఘనంగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చక బృందం మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు.

## '108'కి సుస్తీ : సిబ్బంది కుస్తీ



వాహనాన్ని నెడుతున్న 108 సిబ్బంది

కలిగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న '108' వాహనానికి సుస్తీ చేసింది. దీంతో వాహనం స్టార్ట్ కాకపోవడంతో సిబ్బంది సోమవారం ప్రధాన రహదారిపై వాహనాన్ని నెడుతూ కుస్తీ పట్టడం కనిపించింది. కాలం చెల్లిన వాహనం కావడం, బ్యాటరీ పని చేయకపోవడంతో వాహనం తరుచూ మొరాయిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఆపద కాలంలో అత్యవసరంగా సేవలందించే వాహనం పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## కంకర రాళ్ల రోడ్డుపై ప్రయాణం ఎలా?



కాకర్లపాలెం రోడ్డుపై లేచిన కంకర రాళ్లు

వలేటివారిపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : తారు రోడ్డు చూశాం, మట్టిరోడ్డు చూశాం, సిమెంట్‌రోడ్డు చూశాం.. ఇప్పుడు కంకర రాళ్ల రోడ్డు చూస్తున్నాం. మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెం వెళ్లే సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డంతా కంకరరాళ్లే. బంతుల సైజులో ఉన్న కంకరరాళ్ల రోడ్డుపై నడుస్తూ వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. మెటల్‌రోడ్డుపై ఉన్న మట్టి వర్షానికి కొట్టుకపోవడంతో కంకరరాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల టైర్లకింద కంకరరాళ్లు పడి టైర్లు స్లిప్ అయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అదికారులు, పాలకులు స్పందించి ఆ రెండు కిలోమీటర్లు తారురోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నరసింహం శరీర భాగాల కోసం గాలింపు

● బోరుబావి చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు ● 25 అడుగుల లోతులో బయటపడ్డ దుస్తులు, అవయవాలు ● సంఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం



ఆర్‌ఆర్‌పాలెంలో నిమ్మతోట పక్కన ఉన్న బోరుబావి చుట్టూ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

లింగసముద్రం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఆర్ పాలెంలోని నిమ్మతోట పక్కనే ఉన్న పొలంలో గత నెల 30న హత్యకు గురైన తోపూరి నరసింహం శరీర భాగాల కోసం రెవెన్యూ, పోలీస్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బోరుబావి చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టగా 25 అడుగుల లోతులో శరీర భాగాలు, దుస్తులు లభ్యమయ్యాయి. సీఐ మంగారావు, ఎస్ఐ నారాయణలు తహసీల్దారు సీతామహాలక్ష్మి నుంచి అనుమతి తీసుకొని మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు. 25 అడుగుల వరకు తవ్విన తరువాత కేసింగ్ పైపును విరగగొట్టడంతో నరసింహం తల, కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలు, చొక్కా, లుంగీ, బనియన్, డ్రాయరు బయటపడ్డాయి. దీంతో నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల నుంచి వచ్చిన సహాయ ప్రొఫెసర్లు జి వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, వారి సహాయకుడి ద్వారా గుంతలోని అవయవాలను బయటకు తీయించి ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం నిర్వహఙచారు. తహసీల్దారు సీతామహాలక్ష్మి, వీఆర్‌వో జీ.వినోద్ గ్రామ పెద్దలు నరసింహం మృతదేహానికి పంచనామా నిర్వహించారు. నరసింహం శరీరంలోని కొన్ని భాగాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించాలని వారు పోలీసలకు ఇచ్చారు. మిగిలిన శరీర భాగాలను నరసింహం బంధువులకు అప్పగించడంతో వారు వాటిని జంపాలవారిపాలెంలోని ఇంటికి తీసుకొని వెళ్లి శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.

## పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, నిరుపేదలు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ. సురేష్ బాబు, సీనియర్ నాయకులు పీ. బాలకోటయ్య తదితరులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు చొప్పున నివాసయోగ్యం లేని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత జగన్ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాలు గృహనిర్మాణంకు సరిపోవని, తమ ప్రభుత్వం వచ్చాక పేదలందరికీ నివాసయోగ్యమైన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా పట్టించుకోకపోవటం దారుణమని విమర్శించారు. తక్షణం పేదలందరికీ ఇచ్చిన హామీమేరకు స్థలాలు ఇవ్వటంతోపాటు గృహ నిర్మాణంకోసం 5లక్షల రూపాయల ఆర్థికసహాయం అందజేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూడా తక్షణం నెరవేర్చాలని కోరారు. అనంతరం తహసిల్దార్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. మురళీకృష్ణ, వై. ఆనంద్‌మోహన్, నత్తా రామారావు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు, చేవూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు

కొండాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని సర్వే చేయించి భూములు అప్పచెప్పాలని వచ్చిన ఆ వినతులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియో గించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వచ్చే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపీడీవో ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు

# విధ్వంస పాలన నుంచి అభివృద్ధి వైపు అడుగులు

● నేడు పవర్‌పాయింట్ ప్రజంటేషన్

కావలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ మంగళవారం కావలిలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ గురించి వివరించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి చేయడానికి ప్రజల కష్టాలను తొలగించటానికి నిరంతరం ప్రజాసేవలోనే ఉన్నానని తెలిపారు. జూన్ 4 నాటికి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఈ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై, అలాగే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంస పాలనపై మంగళవారం ఉదయం 10.30 గంటలకు డొడ్ల మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయపార్టీల నాయకులకు, పురప్రముఖులకు, పాత్రికేయులకు, ప్రజాసంఘాలను, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వాస్తవాలను ప్రజలకు తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఒక ప్రజాప్రతినిధిగా ఈకార్యక్రమం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సుహృద్భావ వాతావరణంలో మనందరం మన భవిష్యత్తుకు ప్రణాళికలు నిర్ణయించుకుందామన్నారు.



టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా మంజూరు పత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

### టీడీపీ కార్యకర్తకు ప్రమాద బీమా

ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన కావలి పట్టణం ముసునూరుకు చెందిన ఉప్పు గోపాల్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షలను టీడీపీ ప్రమాద బీమా మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లు రూ.5 లక్షల ప్రమాద బీమాను గోపాల్ సతీమణి రమాదేవికి పంపారన్నారు. టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటం వలన గోపాల్ కుటుంబానికి వచ్చిన ప్రమాద బీమా ఆ కుటుంబం ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు కొంత ఉపయోగపడుతోందన్నారు. పార్టీ కుటుంబ సభ్యులకు తాను, పార్టీ ఎప్పుడు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## జేఈఈ ఫలితాల్లో ఆల్ ఇండియా 234 ర్యాంక్



వెంకట మణి ప్రీతమ్

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంకు చెందిన భద్రిరాజు వెంకట మణిప్రీతమ్‌కు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ (ఐఐటీ) ఆల్ ఇండియా 234 ర్యాంక్ సాధించాడు. ప్రీతమ్ తండ్రి భద్రిరాజు నారాయణ మూర్తి గుడ్లూరులోని జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా, తల్లి రజని ముండ్లమూరివారిపాలెం జడ్పీ హైస్కూల్‌లో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రీతమ్ సాధించిన ర్యాంక్ పట్ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు, తోటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

### ● స్పందనకు 866వ ర్యాంకు



స్పందన

కందుకూరు పట్టణంలోని నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థిని పి.స్పందన జాతీయ స్థాయిలో 866వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించిన స్పందనను కళాశాల డైరెక్టర్ పి. శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

● జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థులు పి.అశోక్ (1276), షేక్ జబీర్‌సుల్తాన్ (2218), ఏ. విష్ణుప్రియ(2274), బీ.హర్షిత (5765) ర్యాంకులతో మెరిశారని ఆయన తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు బాలభాస్కర్, బెజవాడ నరేంద్రబాబులతో కలిసి అభినందించారు.

## ఇళ్ల వద్దనే రేషన్ ఇవ్వాలి : సీపీఎం



ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ఇళ్ల వద్దనే రేషన్ సరుకులు ఇవ్వాలని కోరుతూ సీపీఎం నేతలు సోమవారం ఆర్డీవో నన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల వద్దే రేషన్ పంపిణీ చేసిందని కూటమి ప్రభుత్వం రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీ చేసే పాత పద్ధతిని తీసుకువచ్చి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ప్రజలకు అనుకూలమైన విధానాలు మానుకుని ప్రజలు ఇబ్బందులు పడే విధానాలు తీసుకురావడం ఆశ్చర్యకరమన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ సరుకుల పంపిణీలో అవినీతి జరిగిందన్న కారణంతో పాత విధానాన్ని తీసేయడం ఎంతవరకు సమంజసమని, అవినీతి జరగకుండా నియంత్రించే మార్గాలెన్నో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి పునరాలోచించాలని, గతంలోవలే సరుకులను ఇళ్ల వద్దకే పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాలు, కృష్ణమోహన, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నరసింహం కుటుంబానికి ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



హత్యకు గురైన నరసింహం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

లింగసముద్రం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపాలవారిపాలెంలో గత నెల 30న హత్యకు గురైన తోపూరి నరసింహం కుటుంబ సభ్యులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. నరసింహం ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు, టీడీపీ నేత తోపూరి రమేష్, అతని భార్య, జిల్లా టెలికం అడ్వయిజరీ బోర్డు సభ్యులు అనూష, ఇతర కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. నరసింహం హత్య గురించి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నరసింహంను చంపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాల కృష్ణయ్య, జంపాల శివప్రసాద్, జంపాల శ్రీనివాసులు, అడపా రంగయ్య, పి.గురునాథం, బి.కొండపనాయుడు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



గోడపత్రిక అవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, తదితరులు

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు తనపై చేసిన అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసీపీ ఆధ్వర్యంలో జూన్ 4న తలపెట్టిన వెన్నుపోటు దినంకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 3వ తేది పట్టణంలోని మనోహర్‌రెడ్డి కల్యాణమండపంలో ఆయన చేసిన అభివృద్ధిపై పవర్ ప్రజంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిసిందని, అనంతరం తాము సమావేశం ఏర్పాటు చేసి దీటుగా సమాధానం చెబుతామన్నారు. తన ఇంటివద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించానని చేసిన ఆరోపణలపై మంగళవారం స్పందిస్తానని, ఎవరి అవినీతికి పాల్పడ్డారో ఎవరు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారో తేలిపోతుందన్నారు. జూన్ 4వ తేదీతో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా వెన్నుపోటు దినంగా జరుపుకుంటున్నామన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏజీపీ కృష్ణయ్యచౌదరికి సన్మానం



ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కందుకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు సివిల్ కోర్టు ఏజీపీగా నియమితులైన బెజవాడ కృష్ణయ్యచౌదరిని కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణయ్య చౌదరి మూడేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా నిర్వహించటంతో పాటు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీపీ ఎం. ప్రసాదరెడ్డి, న్యాయవాదులు ఎం.మల్లికార్జునరావు, చిడిపోతు హరికృష్ణ, వీవీ సుబ్బారావు, సంపత్‌కుమార్, బీ.మురళీకృష్ణ, పీ.భాస్కరరావు, బీ.రోశయ్య, కె.రాజశేఖరరెడ్డి తదితరులున్నారు.

## ముగిసిన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం

కావలిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా పాదికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని బాస్కెట్ బాల్ కోర్టులో మే 1నుంచి ప్రారంభించిన శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు పీడీ జోసెఫ్‌కుమార్ శిక్షణలో చిన్నారులు మెలకువలు నేర్చుకుని క్రీడలో తర్ఫీదు పొందారు. శిక్షణ శిబిరం నిర్వహణకు సహకరించిన విట్స్ చైర్మన్ డొడ్ల విద్యాధర్‌రెడ్డి, విశ్వోదయ రెక్టార్ డొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డిలకు జోసెఫ్ కృతజ్ఞతలు తెలిపారు.



## సర్పాల సయ్యాట!

దుత్తలూరు గ్రామంలోని సీతమ్మ బావి సమీపాన ఖాళీ ప్రదేశంలో సోమవారం రెండు సర్పాలు పెనవేసుకుని సయ్యాట సాగించాయి. ఈ దృశ్యాన్ని ప్రజలు తిలకించి, తమ మొబైళ్లలో బంధించారు. సుమారు అర్ధగంటపాటు సర్పాలు తమ సయ్యాటను సాగించాయి.

- దుత్తలూరు (ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

## ఏబీసీతో భవిష్యత్తుకు బలమైన బాట : వీసీ

వెంకటాచలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు ఏబీసీ (అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్) వ్యవస్థ బలమైన బాట వేస్తుందని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. కాకుటూరులో ఆ వర్సిటీ పరిపాలన భవనంలో సోమవారం అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమీక్షలో వీసీ మాట్లాడారు. నూతన విద్యావిధానంలో సింగిల్, డ్యూయల్, మేజర్ ప్రోగ్రాములుగా మార్చడం ద్వారా విద్యార్థులకు రెండు విభిన్న రంగాల్లో నైపుణ్యం పొందే అవకాశాలు కలుగుతాయన్నారు. విద్యావిధానాల అమలులో అనుబంధ కళాశాలల పాత్ర కీలకమనీ, ప్రతి కళాశాల ఈ మార్పులను విజయవంతంగా అమలుచేయడంలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ సమీక్షలో రిజిస్ట్రార్ సునీత, పరీక్షల నియంత్రణ అధికారి మధుమతి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఉదయ్‌శంకర్, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు



## జనసేన పార్టీ నిధికి రూ.4 లక్షల విరాళం

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నిధికి జిల్లా నాయకులు రూ.4 లక్షల విరాళాన్ని మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబుకు చెక్కు రూపంలో సోమవారం అందించారు. ఆ పార్టీ నేత నూనె మల్లికార్జున యాదవ్ రూ.లక్ష, సర్వేపల్లి నియోజకవర్గ నాయకుడు బోనుబోయిన ప్రసాద్, ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలం దువ్వూరుకు చెందిన చదలవాడ హరీష్, వెంకటగిరి నాయకులు అనిల్ రామారావులు రూ.3 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో గునుకుల కిషోర్, కాకు మురళీ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవి, జమీర్, గుర్రం కిషోర్ తదితరులున్నారు.



# అభాగ్యులం.. ఆదుకోండి!

## కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సామాన్యులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఒకటికి రెండుసార్లు వచ్చినా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. కాగా, ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 402 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖవి 169, మున్సిపల్ శాఖవి 38, సర్వేవి 29, పంచాయ తీశాఖకు సంబంధించి 23 అర్జీలు ఉన్నాయి.

### అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీ లకు సత్వర పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కలెక్ట ర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, అం తర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నె ల 21న మైపాడు బీచ్‌లో యోగాంధ్ర కార్యక్ర మాన్ని నిర్వహిస్తు న్నామని ఇన్‌చార్జీ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



### ● మంచినీరు, కరెంటు ఇవ్వండయ్యా

అల్లీపురం టిడ్కో కాలనీ టి.250 బ్లాక్‌కు చెందిన నాగమణి తదితర మహిళలు తమ కాలనీకి మంచి నీటి వసతి కల్పించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించను వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికి ఒక సారి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చామని అయినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మంచి నీరు, కరెంటు లేకుండా ఎలా జీవించాలంటూ వాపోయారు.

### ● ఇళ్లు చూపించడయ్యా

రామసుబ్బమ్మ, వేణమ్మది రాపూరు మండలం రామదేవపల్లి. 2014-15 సంవత్సరాల మధ్య రైల్వేలైను కోసం తమ ఇళ్లను తొలగించారని, ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తామని అధికారులు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికి కలెక్టరేట్ చుట్టూ పదిసార్లు తిరిగినా తమ గోడు అధికారులు వినలేదని వాపోయారు. 35 మంది ఇళ్లను కోల్పోయామని, అందరికీ ఇళ్లు కేటాయించాలని కోరారు.





### ● పింఛను ఇప్పించండి

ఈమె పేరు కె.శాంతమ్మ. నెల్లూరులోని కొండాయపాళెం వాసి. వయసు 80 సంవత్సరాలు. భర్త, పిల్లలు ఎవరూలేని అభాగ్యురాలు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పింఛను ఇచ్చేవారని, వైసీపీ వచ్చాక పింఛను ఆపేశారని వాపోయింది. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినందున తనకు పింఛను మంజూరు చేయాలని కోరింది. ఇప్పటికే మూడు సార్లు కలెక్టరేట్‌కు వచ్చానని, అయినా పింఛను మంజూరు చేయలేదని చెప్పింది.

### ● దివ్యాంగ పింఛను కోసం..

ఈమె పేరు పల్లెపు పిస్తమ్మ, అల్లూరు మండలం నార్త్ అమూలూరు. దివ్యాంగ పింఛను ఇప్పించాలని అల్లూరు మండలంలోని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవటంతో కలెక్టరేట్‌కు వచ్చింది. అయినా పింఛను మంజూరు కాక పోవటంతో రెండోసారి కలెక్టరేట్‌కు వచ్చింది. తన సమస్యను తెలుసుకుని పింఛను మంజూరు చేయాలని పిస్తమ్మ కోరుతోంది.



● నాడు ప్రయాణానికి..

నేడు ఆరోగ్యం మెరుగుదలకు

● నేడు అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం

# వన్నె తగ్గని సైకిల్!



రాజుల కాలం నాటి రథాలు పోయాయి. జమీందార్ల జట్కాలు పోయాయి. ఎడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ శతాబ్దాలు గడుస్తున్నా ఇంధన, ఎలక్ట్రిక్ యుగాలు నడుస్తున్నా.. నాటికి నేటికి అంతే ప్రాధాన్యతతో నిలబడింది సైకిల్. జనజీవనంలో ఇంటింటి నేస్తంగా చెరగని బంధం ఏర్పరుచుకున్న యంత్ర పరికరం సైకిల్. నాలుగైదు దశాబ్దాల క్రితం వరకూ పల్లె నుంచి మరో పల్లెకు వెళ్లాలన్నా, పక్కనున్న పట్టణానికి చేరుకోవాలన్నా ఎడ్ల బండ్లే ప్రధాన ప్రయాణ సాధనం. ఒకరిద్దరు ప్రయాణించాలంటే నడక ఒక్కటే మార్గం. సైకిల్ అందుబాటులోకి రావడంతో జనజీవనంలో ప్రయాణం వేగం పుంజుకుంది. ప్రతి ఇంటికి సైకిల్ ఒక అవసరంగా మారింది. అప్పట్లో 20, 30 కిలోమీటర్ల దూరమైనా ఇద్దరు, ముగ్గురు హాయిగా సైకిల్‌పై ప్రయాణించేవారు. ఆ రోజుల్లో ర్యాలీ సైకిల్ కలిగి ఉండటం అంటే గొప్ప. ఆ తర్వాత హెర్కులెస్, అట్లాస్ సైకిళ్లు మార్కెట్‌ను ఏలాయి. సైకిల్ రిపేరు షాపులు కూడా చాలా మందికి జీవనోపాధిగా మారింది.

కాలం మారింది. ప్రయాణంలో వేగం పెరిగింది. పెట్రోలుతో నడిచే మోటార్ బైక్‌లు రంగ ప్రవేశం చేశాయి. విపరీతంగా అప్పులిచ్చే ఫైనాన్స్ సంస్థలు అందుబాటులోకి రావడంతో బైక్‌ల శకం మొదలయ్యింది. అయినా ఇప్పటికీ సైకిల్ వన్నె తగ్గలేదు. పల్లె ప్రాంతాల్లోని విద్యార్థులకు సైకిలే ప్రధాన ప్రయాణ సాధనం. అంతేకాదు పడవల్లాంటి కార్లు కలిగిన సంపన్నులు కూడా ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుతున్నారు.

### ● ఆరోగ్య సాధనంగా

ప్రయాణ సాధనంగా జనజీవనంలోకి అడుగు పెట్టిన సైకిల్ ఇప్పుడు ఆరోగ్య సాధనంగా మారింది. ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల టైప్1, టైప్2 డయాబెటీస్ బాధితుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అధ్యయనాల్లో గుర్తించారు. అంతేకాదు గుండె జబ్బులు తగ్గిస్తాయని, సైకిల్ తొక్కే అలవాటు కేన్సర్‌ను నియంత్రించే శక్తి శరీరానికి ఇస్తుందని గుర్తించారు. సైకిల్ తొక్కడం వల్ల ఊరిపితిత్తులు బలోపేతం అవుతాయని పరిశోధనల్లో రుజువు చేశారు. ఈ కారణంగానే కరోనా కాలంలో ఊపిరి తిత్తుల బలం పెంచుకోవడం కోసం ఎంతోమంది సైకిల్ తొక్కడం మొదలు పెట్టారు. సైకిల్ వాడకం పెంచాలని, తద్వారా ప్రజారోగ్యం మెరుగు పడటం తోపాటు వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించగలుగుతా మని ప్రపంచ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. సైకిల్ ప్రాధాన్యతను గుర్తించారు. వాస్తవానికి చరిత్రలో సైకిల్‌కు ఒక గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే ప్రయత్నం 2016లో జరిగింది. 2018లో అంతర్జాతీయ సమితి దానికి ఆమోదించింది. అప్పటి నుంచి జూన్ 3వ తేదీన అంతర్జాతీయ సైకిల్ దినోత్సవంగా ప్రపంచ దేశాలు జరుపుకొంటున్నాయి. జనజీవనానికి ఇంత మేలు చేసే సైకిల్‌ను మనమూ గౌరవిద్దామా! మళ్లీ సైకిల్ ఎక్కుదామా!!

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

## నమ్మించి మోసం చేశారు.. న్యాయం చేయండి !

### పీజీఆర్ఎస్‌లో ఎస్పీని వేడుకున్న బాధితులు

నెల్లూరు(క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటే నమ్మింది ఓ తల్లి. తన ఇంటిపై రుణం ఇప్పిస్తామంటే నమ్మి రూ. లక్షలు ఇచ్చింది ఓ మహిళ. లండన్‌లో ఉన్న కుమారుడికి డబ్బు పంపమని నమ్మకంగా ఓ వ్యక్తికి ఇచ్చాడు తండ్రి.. కానీ ఆ వ్యక్తి పంపలేదు. ఇలా నమ్మించి మోసం చేశారని, న్యాయం చేయాలని పలువురు బాధితులు ఎస్పీ పీజీఆర్ఎస్‌లో వేడుకున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 104 మంది బాధితులు తమ సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ. కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారుల ను ఆదేశించారు.

● నగరంలోని వేదాయపాలెం ప్రాంతానికి ఓ మహిళ తన కుమారుడికి ఉద్యోగం కోసం నగరంలోని పోలీసుకాలనీకి చెందిన శివయ్యను సంప్రదించింది. ప్రభుత్వశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో ఆ మహిళ రూ.15 లక్షలు నగదును శివయ్యకు ఇచ్చింది. రెండు ప్రాంతాల్లో ఉద్యోగం వచ్చిందని అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను శివయ్య ఆ మహిళకు ఇచ్చాడు. అక్కడకు వెళ్లి విచారిస్తే అవి నకిలీవని తెలిసింది. మోసపోయామని తెలుసుకొని, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు. తనకు న్యాయం చేయాలని మహిళ కోరింది.

● బాలాజీనగర్‌కి చెందిన ఓ వ్యక్తి కుమారుడు లండన్‌లో చదువుతున్నాడు. తన కుమారుడికి నగదు పంపేందుకు చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న అవినాష్‌రెడ్డి అనే వ్యక్తిని సంప్రదించాడు. తాను పంపుతానని అతను చెప్పడంతో రూ.1,02,000ల నగదు ఇచ్చాడు. అతను డబ్బులు పంపకుండా తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడనని బాధితుడు తెలిపారు. విచారించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

● దర్గామిట్టకి చెందిన వ్యక్తి జొన్నవాడలోని ఓ ఆలయ పూజారిగా ఉన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ఓ మహిళ పూజ చేయించుకోవాలని పూజారిని అడిగి ఫోన్ నెంబర్ తీసుకుంది. అప్పటి నుంచి తరచూ ఫోన్‌లు చేస్తూ తాను చెప్పినట్లు వినాలని, లేకుంటే సోషల్ మీడియా ద్వారా పరువు తీస్తానని వేధిస్తున్నట్లు బాధిత పూజారి ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

● కోవూరుకి చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన రషీద్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. నమ్మిన ఆ యువతి ఇప్పుడు పెళ్లి చేసుకోమని కోరితే ఫోన్‌లోని వీడియోలు చూపించి బెదిరిస్తూ, ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయం చేయాలని కోరింది.

● సంగం గ్రామానికి చెందిన అనిల్ తన వెంటపడి వేధిస్తున్నాడని, ఇంటికి వచ్చి బెదిరిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించినా అతని ప్రవర్తనలో మార్పు రావడం లేదని, రక్షించాలని యువతి కోరింది.

● అల్లూరుకి చెందిన వృద్ధురాలిని ఆమె చిన్న కుమారుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆస్తి కోసం ఇబ్బందులు పెడుతున్నాడని, కుమారుడు నుంచి ప్రాణహాని ఉందని న్యాయం చేయాలని కోరింది.

● వలేటివారిపాలెంకి చెందిన ఓ మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్న హోటల్ నడుపుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన మనోజ్ అతని అనుచరులు హోటల్ వద్దకు వచ్చి అల్లరి చేస్తూ గొడవలు చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని ఆమె కోరింది.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్నఎస్పీ కృష్ణకాంత్

## మైనింగ్ అవినీతిపై విచారణకు వినతి

నెల్లూరు (వైద్యం) జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): మైనింగ్ మాఫియాపై సీబీఐతో విచారణ జరిపించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్‌ను కాంగ్రెస్ నేతలు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వారు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కాంగ్రెస్



జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సైదాపురం మండలంలో రూ. కోట్ల విలువ చేసే తెల్లరాయిని చెన్నై మీదుగా చైనాకి అక్రమంగా పంపుతు న్నారని తెలిపారు. ఇందులో నేతల హస్తంపై నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుధీర్, మల్లికార్జునరెడ్డి, ఇర్ఫాన్, అల్లాఉద్దీన్, సుజాత, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో తప్పుడు ఫిర్యాది

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తనపై పలువురు దాడి చేశారంటూ తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడని ఓ యువకుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. శనివారం అర్ధరాత్రి పలువురు దాడి చేసి రాయితో కొట్టారని పోలినాయుడుచెరువుకు చెందిన యస్దానిని అతని సోదరుడు బాబు, బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై విచారించిన పోలీసులు మద్యం మత్తులో వీరంగం సృష్టించి కిందపడడంతో ముఖంమీద గాయాలయ్యాయని, అయితే హత్య కేసులో నిందితుల బంధువులు కొట్టారని తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడని యస్దానిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కానీ యస్దాని బంధువులు మాత్రం యస్దానిపై ముగ్గురు వ్యక్తులు మూకుమ్మడి దాడి చేయడంతో గాయాలయ్యాయని చెబుతున్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించొద్దు

నెల్లూరు (క్రైం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాత నేరస్థులు, రౌడీమూకలు, అనుమానితులు, కేడీలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించ వద్దని, బైండోవర్లను అతిక్రమిస్తే జరిమానా కట్టించ డం, ఆస్తులు జప్తులు చేయాలని జిల్లా పోలీసు అధికారులకు గుం టూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు ఐజీ సమీక్షించారు. ఈ సందర్భం గా ఐజీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. చిన్న పిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించరాదని, మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే ఛేదించాలని ఆదేశించా రు. కొత్త న్యాయ చట్టాలపై ప్రతీ ఒక్కరూ పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రిపూట గస్తీలు ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. ఇక జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసు వెనుక ఉన్న మూలాలను తెలుసుకుంటే పురోగతి సాధించగలుగుతారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేషిం చి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించడానికి ప్రణాళికలు, ముందస్తు చర్యలను ఎస్పీ వివరించారు.

## మాతా,శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి ?

### ● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా,శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయో పరిశీలించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, మేలో జరిగిన మాతా,శిశు మరణాలపై సబ్‌కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో చాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి గర్భిణీకి త్వరితగతిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రు లలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఆమె ఆదేశించా రు. పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు ఇచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు రక్తహీనత లేకుండా ఐరన్ సిరప్, మాత్రలు తప్పనిసరిగా ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, డాక్టర్ మేరిస్నిగ్ధ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సిందూజ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత, పాల్గొన్న అధికారులు

## ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో అనర్థాలు

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

● సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



గుడ్డ సంచులను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ రావు, అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం ప్రజలు అందరూ అలాంటి ప్లాస్టిక్ వాడకాన్ని మానివేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై సోమవారం తిక్కన భవన్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ఆ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు జిల్లా స్థాయి అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీనెలా నిర్వహించే జిల్లా పరిశ్రమల ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్లాస్టిక్ నిర్మూలన అజెండాగా చేర్చి ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. కాలుష్య ని యంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టాలనే థీమ్‌తో ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ ప్రత్యా మ్నాయ వస్తువుల వాడకంపై బుధవారం అన్నీ మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 5వ తేదీన నెల్లూరులో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం గుడ్డ సంచు లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజకుమారి, గంగా భవానీ, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ధర్నా

నెల్లూరు (వైద్యం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. సోమవా రం కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు గ్రామా ల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని టీడీపీ ఎన్నికల్లో హామీ ఇచ్చిం దన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదయినా ఎక్కడా ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు సిరాజ్, షాన్‌వాజ్, రామరాజు, జిలానీఖాన్, ఆంజనేయులు, ముక్తియార్, బీసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

